

పవన్ పర్యటనలో అపరిచిత వ్యక్తి సంచారం

ఎస్పీకి డిప్యూటీ సీఎం కార్యాలయం ఫిర్యాదు
ఆ వ్యక్తి గూడపల్లికి చెందిన పున్నం నరసింహామూర్తిగా గుర్తింపు

- వార్త మెయిన్‌లో

రబీకి పూర్తిస్థాయిలో సాగునీరివ్వాలి

- సాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రణాళికతో ముందుకెళ్లాలి
- వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్



కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి

అమలాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఇరిగేషన్ సలహా మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలుతీరుపై జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాలులో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా ఇరిగేషన్, డ్రెయిన్స్, రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులు సమన్వయంతో రానున్న రబీ సీజన్‌లో సాగు నీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పూర్తిస్థాయిలో నీటిని అందించాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అలాగే ఖరీఫ్ ధాన్యం సేకరణ, ఆక్వా రిజిస్ట్రేషన్లపై అధికారులతో సమీక్షించారు. రబీ సీజన్‌లో డెల్టా ప్రాంతంలో సాగునీటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన కాల్వల ద్వారా సరఫరా అవుతున్న నీటిని అంచనావేసి వారబందీ విధానంలో చిట్టచివరి ఆయకట్టు వరకు సాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. శివారు ప్రాంత భూములకు నీరు అందని పరిస్థితులు ఉంటే పంటకాల్వలు, డ్రెయిన్లు, చిన్నచిన్న కాల్వలపై క్రాస్ బండ్లువేయడంతోపాటు ఆయిల్ ఇంజన్ల సహకారంతో నీటిని అందించాలని ఆదేశించారు. గతంలో ఎదుర్కొన్న నీటి ఎద్దడి సమస్యలను ప్రస్తావిస్తూ మళ్లీ అవి పునరావృత్తం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. పంటలు పొట్ట దశ పాలు పోసుకునే దశలో నీటి ప్రవాహాన్ని పెంచుతూ సీజన్ ఆద్యంతం కాపాడాల్సిన బాధ్యత ఇరిగేషన్, డ్రైనేజీశాఖ అధికారులపై ఉందన్నారు. స్థానిక నీటి వినియోగదారుల సంఘాలు, ఇరిగేషన్, వ్యవసాయశాఖల మధ్య సమన్వయం పెంపొందిస్తూ మండలస్థాయిలో వారానికి ఒకసారి, డివిజన్‌స్థాయిలో 15 రోజులకు ఒకసారి సాగునీటి సరఫరా అంశాలపై సమీక్షించి ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గతంలో ఉత్పన్నమైన సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన అంచనాల నివేదికలను రూపొందించి డిసెంబరు 2వ తేదీ నాటికి సమర్పిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. డెల్టా ప్రాంతంలో రబీ సీజన్‌లో సాగునీటి కొరతను అధిగమించేందుకు క్రాస్ బండ్లు, ఆయిల్ ఇంజను సంపులు, వారబందీ విధానం అనుసరించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణకు 3లక్షల 50వేల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాలని సూచించారు. తుఫాను నేపథ్యంలో రైతులు వర్షాల బారిన పడకుండా పంటలు ఒబ్బిడి చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు లక్షా 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు తెలిపారు. ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్‌పై సమీక్షిస్తూ జిల్లా వ్యాప్తంగా 47380 ఎకరాల విస్తీర్ణంలో చెరువులు ఉన్నాయని, వీటిలో 10వేల ఎకరాల చెరువులకు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, 15వేల ఎకరాలు వివిధ కారణాల వల్ల నమోదుకు ఆస్కారం లేదని మత్స్యశాఖ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. జిల్లాలో మరో 19వేల ఎకరాల్లో రిజిస్ట్రేషన్‌కు గ్రామాల వారీగా లక్ష్యాలు నిర్దేశించి 15 రోజుల్లో పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో కె.మాధవి, ఇరిగేషన్ అధికారి గోపీనాథ్, వ్యవసాయాధికారి బోసుబాబుతోపాటు ఇతర వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



గడియారస్తంభం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

కోనసీమ జిల్లా నుంచి మండపేటను విడదీయొద్దు

ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి మండపేట నియోజకవర్గాన్ని విడదీయొద్దని ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం గడియార స్తంభం సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయం తప్ప పరిశ్రమలు లేని పరిస్థితులు ఉన్నాయని, అటువంటి స్థితిలో మండపేటను కోనసీమ నుంచి విడదీయడం బాధాకరమన్నారు. మండపేటలో రైసుమిల్లులు, బాయిలర్ మిల్లులు, కోళ్లఫారాలు ఎన్నో ఉన్నాయని, వాటన్నింటినీ తీసుకువెళ్లి తూర్పుగోదావరిలో విలీనం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, గౌరవ కార్యదర్శులు కొవ్వూరి వెంకటరెడ్డి, మోకా వెంకట సుబ్బారావు, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, యర్రంశెట్టి నారాయణమూర్తి, వంటెద్దు బాబు, వలవల శివరావు, వీరిన శేషు సుబ్బారావు, కట్టోజు సుబ్బారావు, నమ్మిన వీరబాబు, తటవర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా : ఎస్పీ



ఉప్పలగుప్తం పోలీసు స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ మీనా

ఉప్పలగుప్తం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా పెడుతున్నట్టు జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా అన్నారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమైన డ్రంక్ అండ్‌డ్రైవ్‌పై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఉప్పలగుప్తం పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రహదారులపై ప్రమాదాలు తరచు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి సంబంధిత కారణాలను సమీక్షిస్తున్నామన్నారు. రహదారి నిబంధనలను పాటించని పలువురు యువత బైక్ ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మాదకద్రవ్యాల వినియోగంపై విద్యా సంస్థల్లో పోలీసుశాఖద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించి వస్తున్న సమాచారంపై తమ సిబ్బంది తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటున్నారన్నారు. మిగతా జిల్లాలతో పోలిస్తే అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మత్తుపదార్థాల వినియోగం, విక్రయం కేసులు నామమాత్రమేనన్నారు. ట్రాఫిక్ నియంత్రణ విషయంలో జిల్లా కేంద్రం అమలాపురంతోపాటు ఇతర పట్టణాలు, ముఖ్య కూడళ్లలో తగిన చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన వివరించారు. ఉప్పలగుప్తం పోలీసు స్టేషన్‌లో రికార్డుల పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ రాజేష్ పాల్గొన్నారు.

శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో భజన మందిరాలు

దేవదాయశాఖ డీసీ వి.సత్యనారాయణ

అంతర్వేది, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని కాపాడేందుకు తిరుమలతిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు పెద్దఎత్తున భజన మందిరాలు నిర్మించనున్నదని దేవదాయ ధర్మాదాయ శాఖ డీసీ సత్యనారాయణ తెలిపారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కేటగిరిలో భజనా మందిరాలు నిర్మిస్తామన్నారు. 5 సెంట్ల భూమికి రూ.10లక్షలు, 8 సెంట్ల భూమికి రూ.15లక్షలు, 10 సెంట్ల భూమికి రూ.20 లక్షలు చొప్పున దేవదాయశాఖ ముందుకు వచ్చి గ్రామాల్లో నిర్మించేందుకు సన్నద్ధమైందన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయ నిర్మాణాలు, గాలిగోపురం, ప్రాకార మండపాలు, ధ్వజస్తంభ నిర్మాణానికి సీజీఎఫ్ ఫండ్ నుంచి 33 శాతం మ్యాచింగ్ ఫండ్ కడితే శ్రీవాణి ట్రస్టు ద్వారా 67శాతం దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ప్రస్తుతం 38 దేవాలయాలు రూ.33 కోట్లతో నిర్మితమవుతున్నాయన్నారు. వేదపారాయణం చదివే బ్రాహ్మణులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగభృతి ఇస్తుండగా, 189 ఆలయాలకు ధూపదీప నైవేద్యాలు సమర్పించడానికి టీటీడీ రూ.10వేలు చెల్లిస్తూ, అర్చకులకు రూ.15,625 కనీస వేతనం ఇవ్వాలని దేవదాయ శాఖ నిర్ణయించిందని తెలిపారు. అర్చకుల వివాహానికి టీటీడీ రూ.లక్ష రుణం ఇచ్చి, ఉపనయనం రూ.25వేలు, సొంతింటికి రూ.5 లక్షలు, వైద్య సాయానికి రూ.2లక్షలు, సర్వీసు మరణం అనంతరం రూ.4లక్షలు, రిటైర్మెంట్‌కు రూ.4 లక్షలు ఇవ్వనున్నారని తెలిపారు. కోనసీమ జిల్లాలో మొత్తం 928 దేవాలయాలుండగా, వాటికి 1,764 ఎకరాల భూమి ఉందని, కొన్నిభూములు మూడు సంవత్సరాలు కౌలుకు, మరికొన్ని 11 సంవత్సరాలు లీజుకు ఇస్తున్నట్టు తెలిపారు. అంతర్వేది, వాడపల్లి, అప్పనపల్లి, మురమళ్లలో మధ్యాహ్నం నిత్యాన్నదానం జరుగుతోందని, మురమళ్లలో రాత్రి సమయంలోనూ నిత్యాన్నదానం జరుగుతోందన్నారు. అలాగే ప్రతీ దేవాలయ అభివృద్ధికి దేవదాయశాఖ కృషి చేస్తోందని చెప్పారు.



టిడ్కో డబ్బులిస్తారా!

పేదింట తీరని కలత

లక్ష కట్టండి.. సొంతింట్లో దిగండి.. ఇదీ గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చిన భరోసా.. చాలా మంది పేదలు అప్పులు చేసి మరి రూ.లక్ష చొప్పున కట్టారు. అయితే 2019లో టీడీపీ ఓటమిపాలవడంతో టిడ్కో ఇళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో పలువురికి ఇళ్లను రద్దు చేసేసింది. అయితే ముందు చెల్లించాల్సిన రూ.లక్ష మాత్రం ఏ ఒక్కరికీ చెల్లించలేదు. గత ఐదేళ్లుగా సొమ్ము వెనక్కు రాక ఈసురోమంటున్నారు. అప్పులు చేసి కట్టిన డబ్బులు ఇవ్వకుండా ఎన్నాళ్లు ఏడిపిస్తారంటూ కలెక్టరేట్ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో తమకు ఇన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. ప్రస్తుత ప్రభుత్వమైనా కరుణించాలంటూ గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తులు చేస్తున్నారు. అయినా డబ్బుల సంగతి తేలకపోవడంతో అయోమయంలో ఉన్నారు.

- (కాకినాడ, ఆంధ్రజ్యోతి)

- వైసీపీలో టిడ్కో నిధులు మళ్లింపు
- ఇళ్లు రద్దు చేసినా చెల్లింపుల్లేవ్
- ఐదేళ్లగా లబ్ధిదారుల ఎదురుచూపులు
- అయోమయంలో రూ.10.52 కోట్లు
- ఎంపీ, ఎమ్మెల్యేలకు విన్నపాలు
- అయినా ఫలించని వైనం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టిడ్కో ఇళ్ల రద్దయిన వారి డబ్బులు రూ.10.20 కోట్ల మేర పేరుకుపోయాయి. ఆ రిఫండ్ డబ్బులు వస్తాయో రావో అన్నట్టుగా పరిస్థితి మారింది. నిధుల విడుదలకు ఆయా మునిసిపాలిటీల వారీగా ఎమ్మెల్యేలు సైతం ప్రయత్నం చేస్తున్నా అమరావతిలో టిడ్కో ఉన్నతాధికారులు మాత్రం ఉలుకు పలుకు లేకుండా ఉన్నారు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో రూ.6.53 కోట్లు, రామచంద్రపురం రూ.1.20 కోట్లు, పెద్దాపురం రూ.59.28 లక్షలు, మండపేట రూ.42 లక్షలు, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లో 21 లక్షల చొప్పున రిఫండ్ డబ్బులు పేరుకుపోయాయి.

టీడీపీ ఇస్తే..వైసీపీ వచ్చి లాగేసుకుంది..

2014లో అధికారంలోకి వచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణాలు, నగరాల్లో నివసించే పేదల కోసం టిడ్కో ఇళ్లు నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు 2017-2019 మధ్య లబ్ధిదారులను ఎంపిక చేసింది. టిడ్కో ఇళ్ల కోసం ఆయా మునిసిపాలిటీలకు లబ్ధిదారుడి వాటాగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25వేల చొప్పున చెల్లించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లపై కత్తి కట్టింది. పేదలకు ఇవ్వకుండా నిలిపివేసింది. వేలాది మందికి మంజూరైన టిడ్కో ఇళ్లను రద్దు చేసేసింది. ఈ మేరకు లబ్ధిదారులకు అంతకు ముందు వారు చెల్లించిన మొత్తాన్ని వెనక్కు ఇవ్వాల్సి ఉంది. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ డబ్బులను అప్పటికే మునిసిపాలిటీల నుంచి టిడ్కోలో ప్రత్యేక ఖాతాకు మళ్లించేసి వాడేసుకుంది. దీంతో లబ్ధిదారులు ఎంత మొత్తుకున్నా వారి డబ్బులను వెనక్కివ్వలేదు. చివరకు ఇప్పటికి ఐదేళ్లవుతున్నా ఏ ఒక్కరికీ డబ్బులు రిఫండ్ రాక వారంతా లబోదిబోమంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.10.20 కోట్ల వరకు ఈ సొమ్ములు పేరుకుపోయాయి.

ఎక్కడెక్కడ ఎంత ఇవ్వాలంటే..

కాకినాడ కార్పొరేషన్ పరిధిలో రూ.6.53 కోట్లు రిఫండ్ డబ్బులు వెనక్కు రాక లబ్ధిదారులు నెత్తీ నోరు బాదుకుంటున్నారు. రూ.లక్ష చొప్పున 589 మందికి, రూ.25 వేల చొప్పున 150 మందికి, రూ.50 వేల చొప్పున 448 మందికి డబ్బులు రాలేదు. అప్పట్లో కార్పొరేషన్ పరిధిలో 2,056 టిడ్కో ఇళ్లు నిర్మించారు. సైట్-ఏలో 1,152 ఇళ్లు, సైట్-బీలో 904 ఇళ్లు నిర్మించారు. వీటికి సంబంధించి ఇళ్లు మంజూరై ఆనక రద్దయిన, రద్దు చేసుకున్న లబ్ధిదారులకు రూ.6.53 కోట్లు వెనక్కు రాలేదు. సామర్లకోట మునిసిపాలిటీ పరిధిలో 1,056 ఇళ్లు నిర్మించగా వీటిలో రద్దు చేసుకున్న వారికి రూ.25 లక్షలు వెనక్కు రావాల్సి ఉంది. ఇందులో రూ.లక్ష చొప్పున 33 మందికి రావాల్సి ఉంది. పెద్దాపురం మునిసిపాలిటీలో 3,312 ఇళ్లు నిర్మించగా రద్దు చేసుకున్న వారికి రూ.59.28 లక్షలు ఐదేళ్ల నుంచీ వెనక్కు రావడం లేదు. వీరిలో రూ.లక్ష చొప్పున చెల్లించిన వారు 55 మంది, రూ.50 వేల చొప్పున చెల్లించిన వారు 106 మంది ఉన్నారు. పిఠాపురంలో 864 టిడ్కో ఇళ్లు నిర్మించగా రూ.10 లక్షలు ఇంకా వెనక్కు రాలేదు. రామచంద్రపురం మునిసిపాలిటీలో లబ్ధిదారులకు రూ.1.20 కోట్లు రావాల్సి ఉంది. వీరిలో రూ.లక్ష చొప్పున చెల్లించిన వారు 92 మంది ఉన్నారు. మండపేట మునిసిపాలిటీలో రూ.42 లక్షలు, అమలాపురం మునిసిపాలిటీ రూ.40 లక్షలు రావాల్సి ఉంది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీల పరిధిలో రూ.21 లక్షల వరకు రావాల్సి ఉంది.

వస్తాయా.. రావా..

లబ్ధిదారులకు వెనక్కు ఇవ్వాల్సిన డబ్బులను అప్పటి వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వాడేసుకుంది. దీంతో రిఫండ్ డబ్బులు ఎవరికీ రాలేదు. ప్రభుత్వం మారిన తర్వాత అనేక మంది బాధితులు ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చి కలెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తున్నారు. తమ డబ్బులు తమకు ఇప్పించాలని కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల వద్దకు సైతం లబ్ధిదారులు తిరుగుతున్నా పనవడం లేదు. ఈ నిధులు లబ్ధిదారులకు వెనక్కివ్వాలని కలెక్టర్లు,ఎమ్మెల్యేలు సైతం టిడ్కోకు లేఖలు రాసినా ఎలాంటి ప్రయోజనం లేదు. తమ వద్ద ఆ నిధులు లేవని అక్కడి అధికారులు సమాధానం చెబుతున్నారు. దీంతో రిఫండ్ డబ్బులపై అయోమయం నెలకొంది. ఇటీవల కాకినాడకు వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ దృష్టికి అధికారులు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం దృష్టికి మరోసారి తీసుకువెళ్తానని పేర్కొన్నారు.



అంబాజీపేట మండలం ముక్కామలలో విత్తనాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలి
- కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

అంబాజీపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ప్రవేశపెట్టిన రైతన్న మీకోసం' కార్యక్రమం ప్రతి గ్రామంలో నిర్వహించే చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. అంబాజీపేట మండలం ముక్కామల గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన రైతన్న మీకోసం' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించి ఆరోగ్యవంతమైన పంటలను సాగు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోనేలా ప్రోత్సహించాలన్నారు. రబీపంటకు సంబంధించి యూరియా అంచనాలను ఇప్పటి నుంచే రూపొందించాలని, గత సీజన్ వినియోగాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. పెరిగిన పంటల విస్తీర్ణతను దృష్టిలో ఉంచుకుని గ్రామం, మండలాల వారీగా యూరియా ఎంత అవసరమో అంచనాలు రూపొందించాలన్నారు. రైతులకు అధిక లాభాలు అందేలా పంట వైవిధ్యతను ప్రోత్సహించి అవగాహన పెంపొందించాలన్నారు. రైతులతో గౌరవంగా మాట్లాడి వారికి ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా వ్యవసాయశాఖ సిబ్బంది, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్ల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జవాబుదారీతనంతో ముందుకెళ్లేలా చూడాలన్నారు. ఈనెల 24 నుంచి 29 వరకూ రైతన్నా మీకోసం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డిసెంబరు 3న రైతుసేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాప్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రతి రైతు వ్యవసాయాన్ని కొనసాగించేలా రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రకృతి సేంద్రియ వ్యవసాయంలో రసాయన ఎరువులు, కీటక నాశకాలు వాడకుండా ప్రకృతి వనరుల సహజ ఎరువులు పంచగవ్యం, కంపోస్టు ఉపయోగించి పంటలు పండించాలన్నారు. రైతులు ఖర్చులు తగ్గించి మట్టి ఆరోగ్యం మెరుగుపర్చాలన్నారు. అంతర పంటలు ప్రయోజనాలు, మట్టిసంరక్షణ, నీటి ఆదా, ఆరోగ్య రక్ష పంటలతో దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి, ఏవో ధర్మప్రసాద్, ప్రకృతి వ్యవసాయ ఏవో శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో విస్తృతంగా స్కూల్ బస్‌ల తనిఖీ

- సాంకేతిక లోపాలను సవరించుకోవాలి
- జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా-ప్రమాదాల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా అమలాపురం ఆదిత్య కళాశాలకు చెందిన 37 బడి బస్సులను శుక్రవారం తనిఖీ చేసినట్టు జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. తనిఖీల్లో భాగంగా గుర్తించిన సాంకేతిక లోపాలను వారం రోజుల్లోగా సవరించుకోవాలని స్కూలు యాజమాన్యానికి నోటీసులు జారీచేశామన్నారు. డిసెంబరు 4వరకు తనిఖీలు కొనసాగుతాయన్నారు. తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతిసురేష్, కౌశిక్ పాల్గొన్నారు.



మండపేటలో బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ లక్ష్మీ శ్రీదేవి



అమలాపురంలో స్కూలు బస్సులను తనిఖీ చేస్తున్న జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం..

రావులపాలెం/మండపేట, నవంబరు28(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు, కళాశాలలకు విద్యార్థులను తీసుకుని వెళ్లే బస్సులకు రికార్డులు, నియమనిబంధనలను సక్రమంగా నిర్వహించాలని రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఓలేటి శ్రీనివాస్ అన్నారు. రావులపాలెంలో శుక్రవారం పాఠశాల, కళాశాలల బస్సులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్సుల ఫిట్‌నెస్ సక్రమంగా నిర్వహించాలన్నారు. పరిమితికి లోబడే విద్యార్థులను తరలించాలన్నారు. అత్యవసర ద్వారాలను నిత్యం తనిఖీ నిర్వహించాలన్నారు. అలాగే పాఠశాల, కళాశాలల యజమాన్యం డ్రైవర్లకు లైసెన్సు ఉందా లేదా, డ్రైవింగ్ అనుభవం ఎంతవరకూ ఉంది అనే అంశాలను పరిశీలించాలన్నారు. ఈ తనిఖీలలో అసిస్టెంట్ ఎంవీఐ షణ్ముఖ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రహదారి భద్రతా ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా పాఠశాల కళాశాలలకు చెందిన 30 బస్సులను జిల్లా రవాణాశాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు మండపేట ప్రాంతీయ రవాణశాఖాధికారిణి లక్ష్మీశ్రీదేవితో కలిసి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో చిన్న చిన్న లోపాలను గుర్తించి ఆయా పాఠశాలల యాజమాన్యాలకు వారంరోజుల్లోగా లోపాలను సరిచేసుకోవాలని నోటీసులు జారీచేశామని శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీలు డిసెంబరు నాలుగవ తేదీ వరకు జరుగుతాయని ఆయన తెలిపారు.



ఇంటర్మీడి 'హీట్'

- మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికలు
- ప్రభుత్వ కళాశాలల విద్యార్థులపై ఫోకస్
- సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- స్టడీ అవర్స్ నిర్వహణ

ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఇంటర్ బోర్డు అధికారులు అడుగులు వేస్తున్నారు. మెరుగైన ఫలితాల కోసం కార్యాచరణ సిద్ధం చేశారు. ఇంటర్‌బోర్డు సూచనలకు అనుగుణంగా 'సంకల్ప దీక్ష' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

– కాకినాడ, ఆంధ్రజ్యోతి

ఏ జిల్లా.. ఎన్ని కాలేజీలు...

కాకినాడ జిల్లాలో...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 14, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 3, ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ కళాశాలలు 8, హైస్కూల్ ప్లస్‌లు 19, కేజీబీవీలు 4, మోడల్ స్కూల్స్ జూనియర్ స్కూల్స్ 2, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ కళాశాలలు 99 ఉన్నాయి. వీటిలో ఫస్టియర్ విద్యార్థులు 22,574 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 21716 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో..

ఈ జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 15, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 2, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలు 6, హైస్కూల్ ప్లస్‌లు 23, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ కళాశాలలు 82, ఒకేషనల్ కళాశాలలు 21 ఉన్నాయి. వీటిలో ప్రథమ సంవత్సరం 23,118 మంది, ద్వితీయ సంవత్సరం 23,145 మంది విద్యనభ్యసిస్తున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 13, ఏపీఎస్ డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలు 6, హైస్కూల్ ప్లస్‌లు 28, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ కళాశాలలు 88 ఉన్నాయి. 26,840 మంది విద్యార్థులు ఉన్నారు.

సిలబస్ పరిస్థితి ఏంటి..

డిసెంబర్ మొదటి వారం నాటికి అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో సిలబస్ పూర్తి అవుతుందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించే జిల్లాగా గుర్తింపు సాధించేలా అధ్యాపకుల సహకారంతో సమష్టిగా కృషి చేసేలా మూడు జిల్లా డీఐఈవోలు సంకల్ప దీక్షతో ఉన్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు (ప్రథమ, ద్వితీయ)

- కాకినాడ జిల్లా : 42,834
- తూర్పుగోదావరి జిల్లా : 43,872
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా :25,650

గ్రేడ్‌లుగా విభజన..

ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక కసరత్తు!

ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఇప్పటికే అర్ధ సంవత్సర పరీక్షలు పూర్తయ్యాయి. వాటిలో వచ్చిన మార్కులను అంచనా వేసి విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఇంటర్ బోర్డు ఇచ్చిన ప్రశ్నాపత్రాలతో విద్యార్థులకు వారాంతపు పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. ఈ పరీక్షల్లో వచ్చిన మార్కులను ఎప్పటికప్పుడు ఇంటర్ బోర్డుకు పంపుతున్నారు. విద్యార్థులను గ్రేడులుగా విభజించి ఏ, బీ గ్రేడుల్లో ఉన్న వారు బాగా చదువుతున్నట్టు, సీ, డీ గ్రేడ్ విద్యార్థులు ఇంకా మెరుగుపడాల్సి ఉందని గుర్తించారు. ఈ నేపథ్యంలో వారికి ప్రత్యేక శిక్షణతోపాటు కొంతమంది అధ్యాపకులు వారిని దత్తత తీసుకుని స్టడీ అవర్స్ నిర్వహించి ప్రత్యేకంగా చదివించే సంకల్పంతో ఉన్నారు. వచ్చే ఏడాది జనవరి 21 నుంచి ఎన్విరాన్‌మెంట్ పరీక్షలు ప్రారంభమవుతాయి. జనవరి 27 నుంచి ఫిబ్రవరి పదో తేదీ వరకు వృత్తి విద్య కోర్సులు అభ్యసించే వారికి ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఇంటర్ రెగ్యులర్ విద్యార్థులకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 నుంచి పదో తేదీ వరకు ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అనంతరం ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు పరీక్షలు జరగనున్నాయి.





ఖమ్మం జిల్లా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్న మల్లవరం గ్రామానికి చెందిన పురపతి.. శ్రీదేవి, స్రవంతిల పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రాలు ఖమ్మం జిల్లావి కాగా వీరి బిడ్డలవి అల్లూరి సీతారామరాజు జిల్లా ధ్రువీకరణ పత్రాలు



ఒడియా క్యాంపునకు చెందిన ఈ చిన్నారుల్లో సంతోష్ (అన్న)కు తూర్పు గోదావరి జిల్లా, సీతారం (తమ్ముడు)కు అల్లూరి సీతారామరాజు జిల్లా పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి.



వీరంతా చింతూరు ఏరియా ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న గర్భిణులు.. మరి కొద్దినెలల్లో వీరంతా పండంటి బిడ్డలకు జన్మనివ్వబోతున్నారు. కాగా పుట్టబోయే ఆ బిడ్డలంతా పోలవరం జిల్లా పేరిట ధ్రువీకరణ పత్రాలు పొందనున్నారు.

మళ్లీ మారనున్న చిరునామా!

- ఒకే ఊరు .. నాలుగు జిల్లాలు
- ఇది చింతూరు డివిజనుకే సొంతం

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

ఆ ఇంటి పెద్దలకు ఖమ్మం జిల్లా పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలున్నాయి. ఇక 2014లో రాష్ట్ర విభజన తదుపరి ఆ ఇంట్లో పుట్టిన బిడ్డలకు తూర్పుగోదావరి జిల్లా పేరిట, 2022లో జిల్లాల పునర్విభజన తదుపరి పుట్టిన బిడ్డలకు అల్లూరి సీతారామరాజు జిల్లా పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలున్నాయి. తాజాగా పాలనా సౌలభ్యం కోసం మరోమారు చేపట్టిన జిల్లాల పునర్విభజన క్రమంలో అదే ఇంట్లో మరికొద్దిరోజుల్లో పుట్టబోయే బిడ్డకు పోలవరం (రంపచోడవరం) జిల్లా పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రం అందుకోనున్నారు. అంటే ఒకే ఇంట్లో మొత్తంగా నాలుగు జిల్లాల పేరిట పుట్టినరోజు ధ్రువీకరణ పత్రాలు ఉండనున్నాయి. ఓటరు, ఆధార్, రేషన్‌కార్డుల చిరునామాలు కూడా ఇదే వరుసలో మారుతూ వస్తున్నాయి. ఈ తరహా మార్పులు చింతూరు డివిజనులో ఏ ఇంట చూసినా కానవస్తుంటాయి. అంటే పేరు, ఇల్లు, ఊరు మారకపోయినా జిల్లాలు మారుతూ వస్తున్నాయి. ఇదిలా ఉంటే ఒకే పాఠశాలలో లేదా అంగన్వాడీ కేంద్రాల్లోనూ తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల చిరునామాల పేరిట చదువుతున్న చిన్నారులున్నారు. ఇక వారికి పాఠాలు బోధించే ఉపాధ్యాయుల్లో పలువురికి ఖమ్మం జిల్లా పేరిట పుట్టిన స్థల ధ్రువీకరణ పత్రాలు ఉంటుంటాయి. ఈ మార్పులకు కారణం కేవలం పోలవరమే. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. ఇక పోలవరంతో చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలు పోలవరం బ్యాక్ వాటర్‌తో నీట మునగనున్న విషయం సాంకేతికంగా స్పష్టమైంది. దీంతో ముంపు మండలాలను విభజిత ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసేశారు. అప్పటివరకు తెలంగాణ భూభాగంలోని ఖమ్మం జిల్లాలో ఉన్నటువంటి ఈ నాలుగు మండలాలు తూర్పుగోదావరి జిల్లాలోకి విలీనమయ్యాయి. తదుపరి రాష్ట్రంలో చోటుచేసుకున్న పునర్విభజన నేపథ్యంలో విలీన ప్రజలు ఖమ్మం నుంచి తాజాగా పోలవరం జిల్లా వరకు పేరు, ఊరు, ఇల్లు మారకపోయినా జిల్లాలు మారుతూ వస్తున్నారు. తాజాగా సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం, పోలవరం జిల్లాగా ఏర్పాటు చేసేందుకు జీవో నం, 1492తో కూడిన నోటిఫికేషన్ విడుదల చేయడం చకచకా జరిగాయి. దీంతో రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, గుర్తేడు, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవమ్మంగి, చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలతో కూడిన పోలవరం జిల్లా ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. కాగా 30 రోజులు వ్యవధిలో ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలు, మార్పులతో కూడిన లేఖలను జిల్లా కలెక్టర్‌కు ఇవ్వవచ్చని ప్రభుత్వం గడువు ఇచ్చినప్పటికీ పోలవరం జిల్లా ఏర్పాటు ఏకగ్రీవమే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివాసీ నాయకుల నుంచి వివిధ పార్టీల నేతల వరకు పోలవరం జిల్లా ఏర్పాటు నిర్ణయంతో ఏకీభవించడం దీంతో నూతన జిల్లాగా పోలవరం ఏర్పాటు ఇక లాంచనమే. కాగా జిల్లాల మార్పు జరిగిన ప్రతిసారీ సాంకేతిక సమస్య వచ్చిపడుతోంది. దీంతో ప్రజలు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యలను తొలగించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సి ఉంది.

ఆకతాయిలకు చెక్..



- విద్యార్థినులపై వేధింపుల నివారణకు చర్యలు
- 'పోక్సో ఈ-బాక్స్ యాప్'ను ప్రవేశపెట్టిన కేంద్రం
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

విద్యార్థినులపై లైంగిక దాడులు, వేధింపులు, బెదిరింపుల సంఘటనలు ఇటీవలకాలంలో అధికంగా కనిపిస్తున్నాయి. కళాశాలకో, పాఠశాలకో వెళ్లేటప్పుడు వారి వెంటపడి వేధించే ఆకతాయిలు పెరిగారు. వీరి ప్రవర్తనతో ఎంతోమంది విద్యార్థినులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లడం మానేస్తున్నారు. ఈ ఆకతాయిల చర్యలతో అటు తల్లిదండ్రులకు మానసిక ప్రశాంతత కరువవుతోంది. తమ కుమార్తె ఇంటికి క్షేమంగా చేరుతుందా?, లేదా? అనే ఆందోళన వెంటాడుతోంది. చాలా మంది బాధితులు సామాజిక, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో భయపడి ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. కొన్ని చోట్ల పోలీసులు ఇలాంటి ఆకతాయిల వికృత చేష్టలకు అడ్డుకట్ట వేసినా.. చాలా చోట్ల వీరు రెచ్చిపోతూనే ఉన్నారు. విద్యార్థినులను వేధిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలలకు వద్ద, బస్టాండుల్లో, ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లే సమయంలోనూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఆకతాయిల ఆగడాలు మరింత శ్రుతిమించుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేసే దిశగా కేంద్రం 'పోక్సో ఈ-బాక్స్ యాప్'ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌లో ఫిర్యాదు చేస్తే బాధితుల వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు.

ఇలా ఫిర్యాదు చేయవచ్చు..

సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను ముందుగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. పోక్సో ఈ బాక్స్ (పీఓసీఎస్ఓ ఈ బీఓఎక్స్) అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హోం పేజీలో ఎరుపు రంగు బటన్‌పై క్లిక్ చేయాలి. క్రీడా ప్రాంగణం, షాపు, రోడ్డు, స్కూలు, ట్యూషన్, బ్లాక్‌మెయిల్, స్కూల్ బస్, వ్యాన్, కుటుంబసభ్యులు, బంధువులు, ఇం టర్నెట్, సెల్‌ఫోన్ ఇలా రకరకాల చిత్రాలతో గుర్తులు కనిపిస్తాయి. బాధితులు తమ సమస్యలకు సంబంధించిన గుర్తుపై క్లిక్ చేసి పేరు, ఈ-మెయిల్, సెల్‌ఫోన్ నంబర్ నమోదు చేయాలి. సంఘటన సమాచారాన్ని నమోదు చేసి సబ్‌మిట్ చేయాలి. ప్రతి ఫిర్యాదుకు రిఫరెన్స్ ఉంటుంది. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:///ఎన్‌సీపీసీఆర్.జీవోవీ.ఐఎన్/పీఓసీఎస్ఓ// ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఈ యాప్ నిర్వహణ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పరిధిలో ఉంటుంది.





మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాదుకలకు అభిషేకం, పాదగయ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో స్వయంభూ దత్తాత్రేయస్వామి

జై గురుదత్త

- పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం
- మహా సంస్థానంలో తొలిరోజు సర్వ పుష్ప పూజ
- వైభవంగా దత్తాత్రేయ స్వామి గ్రామోత్సవం

పిఠాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రాచుర్యం పొందిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణ వీధుల్లో దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. తొలి రోజు మహా గణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, మంగళ హారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, రుత్విక్కులతో మూలమంత్ర అనుష్టానం, గణపతి అధర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాద పద్మాలకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకీసేవ, సాయంకాలార్చన నిర్వహించారు. సర్వ పుష్ప పూజ అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో పూజలో పాల్గొన్న భక్తులు

పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన దత్తాత్రేయస్వామి సన్నిధిలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మహా గణపతి పూజ, కలశస్థాపనలు, రుత్విక్ వరుణలు, పంచామృత సహిత రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, రుత్వికులతో దత్తమాల మంత్ర అనుష్టానం, గురుచరిత్ర పారాయణ, వేదపారాయణ, గణపతి అధర్వశీర్ష ఉప నిషత్ పారాయణ, విష్ణు, లలిత సహస్ర నామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, దత్తమూల మంత్ర హోమాదులు, సాయంకాల విశేష పుష్పార్చన, మంగళహారతి జరిగాయి. అనంతరం స్వయంభూ దత్తాత్రేయస్వామికి సహస్ర కలువలతో పుష్పార్చన నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మోక్షిత్ శ్రీసాయిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు 'శ్రీప్రకాష్' విద్యార్థి ఎంపిక

పెద్దాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న ఎస్.మోక్షిత్ శ్రీసాయి కాకినాడలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడని డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ నెల 29 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు గుంటూరు జిల్లా పేరిచర్లలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు తరపున పాల్గొంటాడు. విద్యార్థితో పాటు కోచ్ జి.దుర్గాప్రసాద్‌ను విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సి పాల్ ఎంవీవీఎస్ మూర్తి, అకడమిక్ కో-ఆర్డినేటర్ ప్రశాంతి, కల్చరల్ కో-ఆర్డినేటర్ ఉషాచైతన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

'పాడా' ఇన్‌చార్జి పీడీగా శ్రీనివాసరావు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రాంత ప్రాధికార అభివృద్ధి సంస్థ (పాడా) ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా శ్రీనివాసరావును నియమించనున్నారు. ఇప్పటివరకు వున్న చైత్రవర్షిణిని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరు కార్యాలయంలో మైక్రో క్రెడిట్ విభాగం స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ బదిలీ చేశారు. దీంతో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించనున్నారు.



సత్యదేవుని దర్శనానంతరం ఉప కులపతి చంద్రశేఖర్ కుటుంబీకులు



ఏఈవో శ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న సత్యశ్రావ్య

సత్యదేవుని సన్నిధిలో ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి

అన్నవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధికి శుక్రవారం ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ విచ్చేశారు. కుటుంబసభ్యులతో కలిసి స్వామిని దర్శించుకుని ప్ర త్యేక పూజలు చేశారు. అధికారులు ఆలయ మ ర్యాదలతో స్వాగతం పలకగా పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి చెన్నయ్‌కు చెందిన రా వూరి శ్రీసాయి సత్య శ్రావ్య రూ.1,01,116 విరాళం సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఈ మొత్తాన్ని ఏఈవో శ్రీనివాస్, పీఆర్వో అనకాపల్లి ప్రసాద్‌లకు అందజేశారు. దాతను వారు అభినందించి స్వామివారి ప్రసాదం ఇచ్చారు.

సివిల్స్ పరీక్షలకు విజయవాడలో ఉచిత శిక్షణ

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్స్ పరీక్షలకు విజయవాడలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారిణి ఎం.లల్లీ తెలిపారు. శుక్రవారం ఆమె ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు డిసెంబరు 3వ తేదీలోపు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయం, ప్రగతి భవనం, రెండో అంతస్తు, డీఆర్డీఏ కాంప్లెక్స్, కాకినాడలో దరఖాస్తు చేయాలన్నారు. వారికి డిసెంబరు 7న స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారన్నారు. బీసీలను 66శాతం, ఎస్సీలను 20 శాతం, ఎస్టీలను 14శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. సివిల్స్ ప్రిలిమనరీ, మెయిన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను కాకినాడలో ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 0884-2379216, 8008121321 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

జనవరి 24 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు

పెద్దాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలను కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో జనవరి 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ అధ్యక్షుడు గొందేసి రాజా తెలిపారు. నాటికల వివరాలు తెలిపే కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24న ప్రారంభ నాటికగా విజయవాడ వారి మమ్మల్ని బ్రతకనివ్వండి, రెండో ప్రదర్శనగా హైదరాబాద్ వారి గేమ్, మూడో ప్రదర్శనగా కొలకలూరు వారి జనరల్ బోగీలు, 25న విశాఖపట్నం వారి అసత్యం, రెండో ప్రదర్శనగా కాకినాడ వారి ఆచమనం, మూడో ప్రదర్శనగా చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం, 26న హైదరాబాద్ వారి అమ్మచెక్కిన బొమ్మ, రెండో ప్రదర్శనగా ఇది అతని సంతకం ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఇందన బ్రహ్మానందం, కేదారి నాగు, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, వెన్న పండు, నూకలబంతి నానాజీ, కంటిబోయిన ప్రసాద్, ద్వారంపూడి చల్లారావు పాల్గొన్నారు.



నాటిక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బీసీలకు ఎరుకుల కులంగా ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు

జారీ చేస్తున్న అధికారులపై కేసులు పెట్టాలి: ఎరుకుల సామాజికవర్గీయుల డిమాండ్

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీ సామాజికవర్గీయులను ఎరుకుల కులంగా పేర్కొంటూ తమ కులస్తులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకుల ప్రజా సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం లయన్స్ కల్యాణ మండపంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆదివాసీ ఎరుకుల జాతి ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ సదస్సు శుక్రవారం జరిగింది. తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మానుపాటి రామకృష్ణ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు సంగడాల వెంకటరమణ, కోనసీమ జిల్లా అధ్యక్షుడు మానుపాటి గోవిందు మాట్లాడుతూ ఎరుకుల సామాజికవర్గానికి అధికారులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సామాజికవర్గానికి చెందిన వారికి ఎరుకుల కులంగా ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిం చారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటుచేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సదస్సులో ఎరుకుల సామాజికవర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మూడు జిల్లాల అధ్యక్షులు

ఆనందంలో ఆయిల్‌పామ్ రైతు

- టన్ను రూ.19,660
- ధర నిలకడగా ఉండడంతో సాగుపై ఆసక్తి చూపిస్తున్న రైతులు
- జిల్లాలో 49,710 ఎకరాల్లో సాగు
- అత్యధికంగా గండేపల్లి మండలంలో 14 వేల ఎకరాలు


మల్లేపల్లిలో సాగు చేస్తున్న పామాయిల్ తోట

గండేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయిల్‌పామ్ ధర అంచలంచెలుగా పెరుగుతూ ప్రస్తుతం టన్ను రూ.19,660 పలకడంతో పాటు ధర కూడా నిలకడగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ధర నిలకడగాలేక సుమారు రూ.25 వేలకు టన్ను ధర పెంచేసి మళ్లీ రూ.12 వేలకు చేసేయడంతో అప్పట్లో కౌలుకు తీసుకున్న రైతులు తీవ్ర నష్టాలు చవిచూశారు. ఆ సమయంలో పామాయిల్ రైతులు కుదేలయ్యారు. పలుచోట్ల తోటలు సైతం తొలగించిన దాఖలాలు ఉన్నాయి. నిరాశగా ఉన్న రైతుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊపిరిపీల్చుకున్నట్లయ్యింది. పామాయిల్ ఎకరానికి ఎనిమిది నుంచి తొమ్మిది టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెపుతున్నారు. ఎకరానికి సుమారు రూ.30వేలు ఖర్చవుతుందని, సొంత రైతులకు ఎకరానికి లక్ష మిగిలితే కౌలు రైతులకు సుమారు రూ.70 వేలు లాభాలు వస్తున్నాయంటున్నారు. దీంతో మళ్లీ పామాయిల్ తోటలు వేసేందుకు రైతులు ఆసక్తి చూ పుతున్నారు. జిల్లాలో సుమారు 49,710 ఎకరాల్లో రైతులు ఈ పంట సాగుచేస్తుంటే ఒక్క గండేపల్లి మండలంలోనే సుమారు 14వేల ఎకరాల్లో రైతులు ఈ పం టను పండిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధర నిలకడగా ఉండి ఇంకా పెరిగే అవకాశముండడంతో జిల్లాలో 9 వేల ఎకరాల్లో కొత్తగా సాగుచేపట్టారు. అందులో గండేపల్లి మండలంలో అత్యధికంగా రెండు వేల ఎకరాల్లో ఈ సాగును పెంచారని అధికారులు చెపుతున్నారు. అయితే దీంతో పాటు సాగుచేసేందుకు ప్రభుత్వం కూడా రైతులకు రాయితీల రూపంలో చేయూతనివ్వడంతో రైతులు పంటలు చేసేందుకు మరింత ఆసక్తి చూపుతున్నా రు. మొక్కలు నిమిత్తం ఎకరానికి రూ.11వేలు, ఎరువులకు నాలుగు సంవత్సరాలకు రూ.8400, మొక్కతోటలో అంతర పంటలు పండించేందుకు నాలుగు సంవత్సరాలకు రూ.8400 ప్రభుత్వం అందించడంతో చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై డ్రిప్ లైన్ ప్రభుత్వం అందిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయిల్‌పామ్ రైతులకు ఊపిరిపోసినట్లయిందని గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న నష్టాల నుంచి బయడపడుతున్నామని రైతులు చెబుతున్నారు.


గండేపల్లిలో లారీలో లోడు చేస్తున్న పామాయిల్ గెలలు

ఇప్పుడిప్పుడే నష్టాల నుంచి కోలుకుంటున్నాం



గత ప్రభుత్వంలో టన్నుకు రూ.25 వేలు పెంచడంతో అధిక మొత్తంలో కౌలుకు తీసుకున్నారు. ఒక్కసారిగా మళ్లీ ధర తగ్గించేయడంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాను. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధర పెంచడంతో పాటు నష్టాల నుంచి బయటపడుతున్నాం. ధర ఇలాగే ఉంటే రైతులకు గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వ రాయితీలు బాగున్నాయి.

- రైతు పిల్లా సత్తిబాబు, మల్లేపల్లి

131 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు యువకుల అరెస్ట్ ● వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు


నిందితుల్ని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న నల్లజర్ల పోలీసులు

నల్లజర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కేడీపేట సమీపంలోని కాకరపాడు ఏజెన్సీ ఏరియా నుంచి 131 కిలోల గంజాయి తీసుకుని వస్తున్న ఇద్దరి యువకులను శుక్రవారం పట్టుకుని అరెస్ట్ చేసినట్టు నల్లజర్ల సీఐ రాంబాబు పేర్కొన్నారు. వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో తాడేపల్లిగూడెం నుంచి నల్లజర్ల వచ్చే మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఏపీ 31టీఏ 5142 నెంబరు గల బొలెరో వాహనంలో ప్లాస్టిక్ సంచుల్లో తరలిస్తున్నట్టు గుర్తించారు. అలాగే వాహనంతో పాటు సత్యసాయి పుట్టపర్తి జిల్లా గోరంట్ల మండలం మంగాలపల్లికి చెందిన తలారి ఆనంద్, మరో వ్యక్తి అదే జిల్లాకు చెందిన పూల మనోహర్‌ను అరెస్ట్ చేశారు. వీరిలో మనోహర్‌పై పలు పోలీస్ స్టేషన్లల్లో కేసులు నమోదైనట్టు పోలీసులు తెలిపారు. ముఠాను ఎస్సై దుర్గాప్రసాద్, సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారని, వారిని ఎస్పీ నరసింహ కిషోర్, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ అభినందించారు.

చైన్ స్నాచర్‌కు ఆరు నెలల జైలు శిక్ష ఖరారు

కాకినాడ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా నడిచి వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసు తెంపిన కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ మొదటి అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.సాహితి శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ గాంధీనగర్ చీడీలపొర వద్ద అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ 2021 డిసెంబరు 23వ తేదీ రాత్రి 7 గంటల ప్రాంతంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి నడిచి వస్తున్న క్రమంలో స్థానిక సూర్యనారాయణపురానికి చెందిన కర్నేని దుర్గాసాయి బైక్‌పై వేగంగా వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. అనంతరం ఆమె స్థానికుల సహాయంతో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీసీఎస్ ఎస్సై టి.క్రాంతికుమార్ దర్యాప్తు చేపట్టి నిందితుడు దుర్గాసాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కోర్టులో జరిగిన వాదోపవాదనల్లో నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో మెజిస్ట్రేట్ పై విధంగా తీర్పు చెప్పారు. ప్రస్తుత సీఐ మజ్జి అప్పల నాయుడు పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ ఎస్. లోవరాజు సాక్ష్యులను ఏ ప్రలోభాలకు లొంగకుండా ప్రవేశపెట్టి నిందితుడికి శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టి నందుకు ఎస్పీ జి. బిందుమాధవ్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ పి. రఘువీర్ వాదనలు వినిపించారు.

బీఎస్సీ నర్సింగ్ కౌన్సెలింగ్‌కు నేడు తుది గడువు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ మూడో దశ కౌన్సెలింగ్ గడువు శనివారంతో ముగియనుంది. ఈ నెల 27వ తేదీ సాయంత్రం ఆరు నుంచి 29 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే వెబ్ ఆప్షన్‌లకు అవకాశం ఇచ్చారు. తొలి రెండు దశల్లో తేదీలపై స్పష్టత లేక అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేక అవకాశాలు చేజార్చుకున్నారు. ఈ నేపథ్యంలో 3వ దశ కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది జూలై 27న నిర్వహించిన ఏపీఎన్ సెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణులైనవారు అర్హులు. సీట్లు భారీగా మిగిలిపోవడం వల్ల కటాఫ్ మార్కులను 17కు తగ్గిస్తూ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ నిర్ణయం తీసుకుంది. అధికారుల తీరు విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తోంది. కీలక తేదీల ప్రకటన వేళ, మార్పుల వేళ ఎటువంటి క్షేత్రస్థాయి సమాచారం ఇవ్వకుండా విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్
పోటీల్లో రిత్వికకు రజత పతకం


రుత్వికను అభినందిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా

అమలాపురం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మేడిచర్ల రిత్విక తృతీయస్థానం సాధించి రజత పతకం దక్కించుకుంది. ఈసందర్భంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్‌సలీంబాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిత్వికను పలువురు అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ మలిశెట్టి వీరాస్వామి, ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, రాయుడు శ్రీనివాసరావు, కేఆర్ఎస్ ప్రసాద్, ఎం.చంద్రమోహన్‌లతో పాటు బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన శస్త్ర చికిత్స


శస్త్రచికిత్స చేయించుకున్న వ్యక్తితో వైద్యబృందం

సామర్లకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ వైద్య బృందం అరుదైన శస్త్రచికిత్స చేసింది. అత్యంత అరుదుగా కనిపించే డెవలప్‌మెంటల్ డిస్ప్లేసియా ఆఫ్ ది హిప్ రకమైన తుంటి సమస్యకు అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో రోగి పరిస్థితిని వేగంగా విశ్లేషించి తుంటి మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసినట్టు వైద్యబృందం వెల్లడించింది. శుక్రవారం సామర్లకోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ సుదర్శనరెడ్డి, డాక్టర్ మాధవరావు, డాక్టర్ కిషోర్ బాబు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి ప్రాంతానికి చెందిన 45 సంవత్సరాల వయస్సు గల ఏ.సత్యనారాయణ ప్రమాదవశాత్తు పడిపోవడంతో తుంటి ఎముకకు గాయమయ్యింది. దీంతో నడవలేని స్థితిలో ఆసుపత్రికి రావడం జరిగిందన్నారు. సదరు వ్యక్తికి అన్ని ప్రాథమిక వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం గాయంతో పాటు తుంటి ఎముకు పుట్టుకతోనే డెవలప్‌మెంటల్ డిస్ప్లేసియా ఆఫ్ ది హిప్ పేరిట తుంటి ఎముకలో సమస్య ఉన్నట్టు కూడా గుర్తించామన్నారు. వెంటనే అనస్థీషియా వైద్యులు కిషోర్‌బాబు , డాక్టర్ అరవింద్ నేతృత్వంలో శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించామన్నారు. శస్త్రచికిత్స నిర్వహించిన 24 గంటల్లో సత్యనారాయణ తనే స్వయంగా లేచి నిలబడగలగడంతో శస్త్రచికిత్స విజయవంతమైనట్టు తెలిపారు. తనకు ఈ శస్త్రచికిత్స నిర్వహించడంలో మెడికవర్ వైద్య బృందం చేసిన కృషికి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ ఈ తుంటి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం కావడంతో హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్యసేవల స్థాయిని, నిపుణులతో కూడిన మల్టీస్పెషాలిటీ కేర్ సేవల స్థాయిని మరోసారి ప్రతిబింబించిందన్నారు.

మేడపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

- సామర్లకోట మెడికవర్ ఆసుపత్రికి తరలింపు

సామర్లకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గల ఏఏవో కార్యాలయం మేడపై నుంచి ప్రమాదవశాత్తు సుమారు 50 సంవత్సరాల వయసు గల స్వీపర్ జారిపడి తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళితే... రాజమహేంద్రవరానికి చెందిన ఈమె ఇటీవల కారుణ్య నియామకాలలో ఏఏవో కార్యాలయంలో స్వీపరుగా చేరింది. తీవ్రంగా గాయపడిన ఈమెను ఏడీబీ రోడ్డులో గల మెడికవర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రమాద పరిస్థితులు లేవని, కోలుకునేందుకు కొద్దిరోజులు పడుతుందని వైద్యులు పేర్కొన్నట్టు సహచర ఉద్యోగులు తెలిపారు.

జ్యుడీషియల్ క్రికెట్ టోర్నమెంట్

కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు


బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జడ్జి ఆనందిని

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభమైంది. కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి జి.ఆనందిని క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఏడు పురుషుల జట్లు, రెండు మహిళల జట్లు పోటీలో నిలబడగా తొలి రోజు దివ్య వర్సెస్ దుర్గ జట్లు తలపడగా దివ్య జట్టు విజయం సాధించింది.పురుషుల జట్టు నుంచి వైఎస్ఎం,సునీల్‌కాంత్ జట్టు పోటీల్లో తలపడగా వైఎస్ఎం జట్టు విజయం సాధించింది.మోహన మురళి, ఆర్‌వీఎస్ జట్లు తలపడగా మోహనమురళి జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా జడ్జి ఆనందిని మాట్లాడుతూ కాకినాడ బార్ అసోసియేషన్‌లో తొలిసారిగా న్యాయమూర్తులు న్యాయవాదులు కలిసి ఆడ డం శుభపరిణామమన్నారు. ప్రస్తుతం మహిళలు క్రికెట్‌లో వరల్డ్ కప్ సాధించారని అలాగే కాకినాడ బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాదులు కూడా క్రికెట్‌లో రాణించాలని ఆకాంక్షించారు. కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి క్రికెట్ ఆడడం కాకినాడ బార్ అసోసియేషన్‌తో ప్రారంభమైందన్నారు. మూడు రోజులు పాటు సాగే ఈ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం ముగుస్తాయి. కార్యక్రమంలో జనరల్ కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు(చంటి), స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ నరహరిశెట్టి రవికృష్ణ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నక్కా వెంకటేష్, బార్ స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ జోకా విజయ్‌కుమార్, ఇతర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


మ్యాచ్ ఆడుతున్న న్యాయవాదులు

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- కాకినాడ డీఈవో రమేష్
- నెలాఖరు వరకు జిమ్నాస్టిక్ పోటీలు
- 10 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరు


పోటీలను ప్రారంభిస్తున్న కాకినాడ డీఈవో రమేష్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని కాకినాడ జిల్లా విద్యా శాఖ అధికారి పి.రమేష్ తెలిపారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అంతర్ జిల్లా జిమ్నాస్టిక్ పోటీలు ప్రారంభమయ్యాయి. డీవైఈవో సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ ఏడాది ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రస్థాయి మీట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 30 వరకు జరిగే పోటీలకు 10 జిల్లాల నుంచి 400మంది క్రీడాకారులు హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ఐ అడ్మిన్ కార్యదర్శి సుధారాణి తెలిపారు. డీఎస్‌డీవో సతీష్‌కుమార్ మాట్లాడుతూ కాకినాడలో జాతీయస్థాయి ప్రమాణాల జిమ్నాస్టిక్ స్టేడియం ఉందని వచ్చే ఏడాది జాతీయ పోటీలను కాకినాడకు కేటాయించేలా చూడాలని కోరారు. డీఈవో రమేష్ జాతీయ జెండా, డీఎస్‌డీవో ఎస్‌జీఎఫ్ఐ జెండాలను ఆవిష్కరించారు. క్రీడాకారుల కవాతును స్వీకరించిన అనంతరం బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. సెయింటాన్స్ పాఠశాల విద్యార్థుల యోగాసనాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్ సంఘ అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు,ఎల్.జార్జి, రవిరాజు, పీడీలు ప్రసాద్, హరిబాబు, సూరిబాబు, కోచ్ సురేష్, ఎంపిక కమిటీ సభ్యుడు శరత్‌చంద్ర,క్రీడాకారిణి యాసిన్, వివిధ జిల్లాల కోచ్‌లు పాల్గొన్నారు.


జిమ్నాస్టిక్ ప్రదర్శన ఇస్తున్న క్రీడాకారుడు


సెయింటన్స్ స్కూల్ విద్యార్థినుల యోగాసనం

తూర్పుకాపులకు ఓబీసీ సర్టిఫికెట్ల మంజూరుకు కృషి

తూర్పుకాపు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని తూర్పుకాపు విద్యార్థులకు ఓబీసీ సర్టిఫికెట్ల కోసం పడుతున్న ఇబ్బందులు తొలగించి వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర తూర్పుకాపు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి హామీ ఇచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆమె రాజమహేంద్రవరం వచ్చారు. ఈ సందర్భంగా రౌతు తాతాలు కళ్యాణమండపంలో సంఘం కార్యదర్శి మజ్జి రాంబాబు అధ్య క్షతన జరిగిన సమావేశంలో యశ్వసి మాట్లాడుతూ జిల్లాలో తూర్పు కాపు విద్యార్థులను చిన్నచూపు చూస్తు న్న సంఘటనలు తనకు బాధ కలిగిస్తున్నాయని వారికి ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించడానికి అవరసమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఓబీసీ సర్టిఫికెట్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పతివాడ రామరాజు, లంక సత్యనారాయణ, యజరపు మరిడియ్య, ఆర్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. ఎంత పెద్ద తాచుపామో!



అమలాపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బండారులంకలో శుక్రవారం గోరు లావణ్యవతి ఇంట్లోని ఫ్రిజ్‌లోకి తాచుపాము దూరింది. తెలియక తలుపు తీయగానే ఆ పాము బుసలు కొట్టింది. దాంతో ఇంట్లోని వ్యక్తులంతా భయభ్రాంతులకు గురై వెంటనే స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మకు సమాచారం అందించగా అరగంట సేపు శ్రమించి చాకచక్యంగా ఆ పామును బంధించి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టారు.

జాతీయ జంబోరీలో
రాజమండ్రి రైల్వే స్కౌట్స్


జంబోరీలో పాల్గొన్న రాజమండ్రి రైల్వే స్కౌట్స్

రాజమహేంద్రవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లక్నోలో జరుగుతున్న జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరీలో రాజమండ్రి రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.జంబోరీని 23న ప్రధాని మోదీ ప్రారంభించగా.. 29న(నేడు) ముగింపు కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు కానున్నారు. జాతీయ జంబోరీలో పాల్గొనడం ప్రతిష్టాత్మకంగా స్కౌట్స్ భావిస్తారు. దీనిలో పాల్గొన్న వాళ్లకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషను వర్తిస్తుంది. రాజమండ్రి నుంచి కె.రేషిత,ఎ.హర్షవి.సాత్విక, పీబీవీఎస్ కళ్యాణ్, ఎం.చందన్ శివసాయి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఐదుగురికి జైలు


రాజమహేంద్రవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లోని నిందితులకు కోర్టు జైలు శిక్ష, జరిమానాలు విధించింది. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 12 మందిని పోలీసులు కోర్టులో హాజరు పరి చారు. ఏడుగురికి రూ.10వేల చొప్పున, ఒకరికి ఒక రోజు, ఇద్దరికి రెండు రోజులు, మరో ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ 3వ ఏజేఎఫ్‌సీ మేజిస్ట్రేటు సి.రమ్య ఉత్తర్వులిచ్చారు.

రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీల విజేత తూర్పు


విజేతగా నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్టు

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు ప్రతిభ చాటి విజేతలుగా నిలిచినట్టు టీమ్‌కోచ్, మేనేజర్ ఐ.భీమేష్ తెలిపారు. విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలలో అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. అనంతపురం జిల్లా జట్టుతో జరిగిన ఫైనల్ ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర జట్టు అద్భుత ప్రతిభ చాటి ప్రథమస్థానం సాధించింది. ఈ జట్టుకు రామచంద్రపురానికి చెందిన తేజస్వరూప్ కెప్టెన్‌గా వ్యవహరించారు.అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించింది. ఫైనల్స్‌లో కృష్ణా జిల్లా జట్టు తో తలపడి రన్నరప్ సాధించింది. ఈ జట్టుకు అంబాజీపేటకు చెందిన మౌనిక కెప్టెన్‌గా వ్యవహరించింది. ఉమ్మడి జిల్లా జట్లు కోచ్, మేనేజర్లు సునీత, ఎస్వీవీ సత్యనారాయణ, బీటీ త్రినాథవర్మ, వి.నరసింహారావు, ఐ.భీమేష్ వ్యవహరించారు.

రాష్ట్ర గట్కా పోటీలకు పందలపాక విద్యార్థినులు


రాష్ట్ర గట్కా పోటీలకు ఎంపికైన పందలపాక విద్యార్థినులు

బిక్కవోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పందలపాక ఉన్నత పాఠశాల నుంచి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి గట్కా పోటీలకు ఆరుగురు విద్యార్థినిలు ఎంపికైనట్టు హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపికైన వారిలో అండర్-17 నుంచి ఇమ్మంది సత్యహరిణి, కొమ్ము జాహ్నవి, నూలు అపర్ణ, భవ్యశ్రీ అండర్-19 నుంచి గొలుగూరి శ్రావ్యరెడ్డి, దేవాది అలేఖ్య వున్నారు. వీరు ఈ నెల 29 నుంచి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరఫున పాల్గొంటారని హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, తీర్చిదిద్దిన పీడీ యువరాజారెడ్డి, భీమేశ్వర్‌రెడ్డిను హెచ్‌ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోణాల సత్తిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ పంపన వీరసత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్వేది నరసన్న హుండీ ఆదాయం
రూ.47,48,861


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

అంతర్వేది, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 78 రోజులకుగాను ఈ హుండీ ఆదాయాలను జిల్లా డీసీ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో అమలాపురం తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో లెక్కించినట్టు ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. స్వామివారి ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.46,61,265, గుర్రాలక్కమ్మ ఆలయ హుండీ ద్వారా రూ.19,774, అన్నదాన హుండీ ద్వారా రూ.67,823 మొత్తం హుండీల ఆదాయం రూ.47,48,861 వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 2గ్రాముల బంగారం, 23గ్రాముల వెండి వస్తువులు, పలు దేశాల కరెన్సీ నోట్లు లభ్యమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, భక్తులు, విశ్వహిందూపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు తణుకుకు చెందిన జొన్నలగడ్డ శ్రీరామచంద్రమూర్తి రూ.25,001 విరాళంగా శుక్రవారం ఆలయ సిబ్బందికి అందించారు. దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం బహూకరించి సత్కరించారు.

జిల్లా స్థాయి భగవద్గీత పోటీలు

అమలాపురంటౌన్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకుని కోనసీమ జిల్లా స్థాయిలో టీడీపీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. అమలాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సెంటర్ సంబర సెలబ్రేషన్ హాలులో టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ ఓ.నరసింహయోగి పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. మూడు శ్రేణుల్లో ఈపోటీలు జరిగాయి. మొదటి శ్రేణిలో టి.షణ్ముకనందన్, వై.చంద్రమణి, యు.శాంతిదుర్గ, రెండో శ్రేణిలో ఎస్.మహేశ్వరి, ఎన్.సిరి, బి.మౌనిక, తృతీయశ్రేణిలో కె.పద్మావతి, పి.సీతాలక్ష్మి, వి.నాగదుర్గ వరుస స్థానాల్లో నిలిచారు. వీరికి నగదు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు పాల్ ల్యాబ్స్

● డీఈవో, ప్రాజెక్టు కోఆర్డినేటర్

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగు పరచడానికి పాల్ ల్యాబ్స్ ఎంతగానో దోహదపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ పేర్కొన్నారు. పర్సనలైజ్డ్ అడాప్టింగ్ లెర్నింగ్ ద్వారా అభ్యసనా సామర్థ్యాల పెంపు సులభతరం అవుతుందన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లాలో నూతనంగా ఏర్పాటుచేసిన తొమ్మిది పీఎంశ్రీ పాఠశాలల హెచ్ఎంలు, మోడల్ టీచర్లకు పాల్ ల్యాబ్స్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు.



పాల్ ల్యాబ్స్ హెచ్ఎంలకు ట్యాబ్‌లు అందజేస్తున్న డీఈవో సలీంబాషా

ముఖ్య అతిథులుగా సలీంబాషా, మమ్మీ మాట్లాడుతూ పాల్ ల్యాబ్స్‌తో అభ్యసనా ఫలితాలు వేగవంతంగా మెరుగుపడుతున్న విషయాన్ని సర్వేల ద్వారా ఇప్పటికే ప్రభుత్వం గుర్తించిందన్నారు. పాల్ ల్యాబ్ స్టేట్ రిసోర్స్ పర్సన్ టి.నరసింహం శిక్షణలో భాగంగా పాల్ ల్యాబ్స్‌ను ఏవిధంగా వినియోగించాలో ఐఎఫ్‌పీల సహాయంతో వివరించారు. సమగ్రశిక్ష ఏఎంవో, కోర్సు కోఆర్డినేటర్ పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలోని మూలస్థానం, దంగేరు, కడలి, రామేశ్వరం, హసన్‌బాద, కొత్తపేట బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలు, అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రామచంద్రపురం ఎస్‌బీజీ, మండపేట శ్రీగౌతమీ మున్సిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తెలుగు, ఇంగ్లీషు, గణితం సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ అనంతరం హెచ్ఎంలకు ఒక్కో పాఠశాలకు 30 ట్యాబ్‌లు, పౌచ్‌లు, అడాప్టర్లు, చార్జింగ్ కేబుళ్లను అందజేశారు. సమావేశంలో సమగ్రశిక్ష పీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఎఫ్ఎంఎస్‌లు డి.శ్రీరామ్, ఎ.సురేష్ పాల్గొన్నారు.

క్రాస్‌బండ్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

అమలాపురం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రానున్న రబీ సీజన్‌లో పంటకాల్వల శివారు భూములకు సైతం పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని సెంట్రల్ డెల్టా వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ పేర్కొన్నారు. రంగాపురంలోని గోదావరి సెంట్రల్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ప్రాజెక్టు కమిటీ సర్వసభ్య సమావేశం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. క్రాస్‌బండ్లు ఏర్పాటుతో పాటు ఆయిల్ ఇంజన్ల ద్వారా నీరందించేందుకు ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. రబీ సీజన్‌లో వరి నాట్లు పడిన ప్రతీ ఎకరాకు నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. అధికారులు, రైతులను సమన్వయం చేసుకుని నీటిసంఘాలు పనిచేయాలన్నారు. అనంతరం త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న గన్నవరం డివిజన్ డీఈఈ నాగార్జునను శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈఈలు ప్రసాదరాజు, జనార్దన్, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు వైస్‌చైర్మన్ కరుటూరి నరసింహారావు, అల్లవరం, అయినవిల్లి, అమలాపురం, కాట్రేనికోన, అవిడి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు గోపాలరాజు, కాకర శ్రీనివాస్, రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు), ఆకాశం శ్రీనివాస్, జగన్నాథం, ఇరిగేషన్ డ్రెయిన్ల అధికారులు పాల్గొన్నారు.



డీఈ నాగార్జునను సత్కరిస్తున్న కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు

నిధులు దుర్వినియోగమంటూ సభ్యుల ఆందోళన

● నగర పంచాయతీ సమావేశం
● కమిషనర్‌పై చైర్మన్ తీవ్ర ఆగ్రహం
● రికార్డులు స్వాధీనం చేసుకున్న చైర్మన్

ముమ్మిడివరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ సాధారణ నిధులు గల్లంతుపై చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు అధికారులపై ధ్వజమెత్తారు. నగర పంచాయతీ కౌన్సిల్ హాలులో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత ఎనిమిది అంశాలతో కూడిన అజెండా, పది అంశాలతో కూడిన టేబుల్ అజెండాను ప్రవేశపెట్టి చర్చించారు. ఈనేపథ్యంలో ఆరు నెలల కాలంలో మున్సిపాలిటీ ఖాతా నిధుల బుక్ రిజిస్టర్ నిల్వకు, అజెండాలో చూపిన నిల్వకు సుమారు రూ.10లక్షలు తేడా ఉండడంతో చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌ను చైర్మన్ నిలదీశారు. ఆ రూ.10లక్షల నిధులు ఏమయ్యాయో అధికారులు సమాధానం చెప్పాలంటూ కౌన్సిల్ సభ్యులు తీవ్రస్థాయిలో మండపడ్డారు. ఈదశలో చైర్మన్ కలగజేసుకుని రికార్డులను సమావేశానికి రప్పించి ఆరు నెలలుగా రికార్డుల్లో నమోదు చేయకపోవడాన్ని సభ్యులకు వివరించారు. అలాగే అజెండాలో చూపించిన రూ.56లక్షల నిల్వలకు సిస్టం ఖాతాలో చూపిస్తున్న రూ.46లక్షల నిల్వకు మధ్య రూ.10లక్షల నిధులు వ్యత్యాసం ఉండడంతో రికార్డులు అన్నిటినీ చైర్మన్ స్వాధీనం చేసుకుని ఆడిట్ అధికారులకు అప్పగిస్తామని చెప్పడంతో కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. తదుపరి 17వవార్డు కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ అజెండాలోని 17వ అంశంలో జంగిల్ క్లియరెన్సు పనులకు కేటాయించిన నిధులకు, అదనంగా సాధారణ నిధులను కేటాయించాలనే తీర్మానంపై చర్చిస్తూ ఇప్పటివరకు ఎన్ని గంటలకు ఎంత ఎస్టిమేషన్ రూపొందించారు, ఎక్కడెక్కడ ఎన్ని గంటలు యంత్రాలతో పనులు నిర్వహించారో వివరించాలని ఇంజనీరింగ్ అధికారులను నిలదీశారు. ఏఈ శ్రీనివాస్ వివరణ ఇస్తూ 300గంటలకు ఎస్టిమేషన్ రూపొందించి ఇప్పటికి 240గంటల పనులు పూర్తిచేసి 13వార్డుల్లో జంగిల్ క్లియరెన్సు ప్రక్రియ చేపట్టగా ఇంకా 7వార్డుల్లో చేయాల్సి ఉందన్నారు. దీనిపై కౌన్సిలర్లు స్పందిస్తూ జంగిల్ క్లియరెన్సు పనుల సమాచారం తెలపకుండా 10గంటలు పనిచేసినా మీటరు పని జరగకపోవడమే కాకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని ఆరోపించారు. లైసెన్సుడ్ టౌన్ ప్లానింగ్ ద్వారా ఒక బిల్డింగ్‌కు అనుమతి తీసుకుని పక్కనే మరో బిల్డింగ్ నిర్మాణం చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం వార్డుల్లో వీధిలైట్లు, శానిటేషన్ సక్రమ నిర్వహణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. కౌన్సిల్ సమావేశానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరుపై సమావేశం ఆగ్రహం వ్యక్తంచేసింది. కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నగర పంచాయతీ సమావేశం

డ్రెయిన్లలో వలకట్లతో ముంపు

అధికారులు, వలకట్ల నిర్వాహకుల తీరుపై రైతుల ఆగ్రహం



సామంత్రకుర్రు వద్ద డ్రెయిన్‌లో వలకట్ల తొలగింపుపై రైతు నాయకులు, మత్స్యకారుల మధ్య వాగ్వివాదం

అల్లవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్స్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో డ్రెయిన్లలో చేపల కోసం బరకాల వలకట్లు వేయడంతో వేలాది ఎకరాల్లో ముంపు బెడద తప్పడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామేశ్వరం మొగ వద్ద ఆక్రమణలు తొలగించక, డ్రెయిన్లలోకి ఆక్వారైతులు సజ్జు తోడేయడం, డ్రెయిన్‌లో అనధికార వలకట్ల వల్ల ఏటా 1600 ఎకరాలు ఊడ్చలేకపోతున్నామని, ఊడ్చిన చేలు ముంపు బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తాము వరిసాగు నష్టాల్లో కూరుకుపోయిందని, 15 రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. రైతు నాయకులు కొనుకు బాపూజీ, బొక్కా శ్రీను, పెన్మెత్స రాజబాబు, వెదుళ్లపల్లి సుబ్రహ్మణ్యం, బొక్కా నాగశివప్రసాద్, బుద్ధరాజు రంగరాజు, దాసం రాంబాబుతో పాటు పలు గ్రామాల రైతులు డ్రెయిన్లలో వలకట్లు తొలగించేందుకు లోయర్‌కౌశిక డ్రెయిన్‌పైకి వెళ్లగా ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. వలకట్లు కోయవద్దంటూ మత్స్యకారులు అడ్డుతగలడంతో వాగ్వివాదాలు జరిగాయి. ఒకరోజు గడువు ఇస్తే మేమే తొలగిస్తామంటూ మత్స్యకారులు బతిమాలాడారు. వలకట్లు, మొగలో ఆక్రమణలు ఇలాగే వదిలేస్తే పంట విరామం పాటిస్తామంటూ రైతు నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే వలకట్ల బారిన పడి అల్లవరం, రెల్లుగడ్డ, యెంట్రుకోన, దేవగుప్తం, మొగళ్లమూరు పరిసర గ్రామాల్లో సుమారు 2500 ఎకరాలు ముంపు బారిన పడగా సుమారు వెయ్యి ఎకరాల్లో వరినాట్లు వేయని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా కలెక్టర్ స్పందించి దాళ్వా నారుమడులు వేసేందుకు వీలుగా డ్రెయిన్లలో వలకట్లు తొలగించేందుకు రెవెన్యూ, డ్రైనేజీ అధికారులను ఆదేశించాలని రైతు నాయకులు కోరుతున్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఉడిమూడి సొసైటీ వద్ద శుక్రవారం నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లోనే వారి వ్యక్తిగత ఖాతాల్లో నగదు జమవుతాయన్నారు. అనంతరం రైతులు వద్దకు వెళ్లి రైతన్నా మీకోసంలో ఐదు సూత్రాలతో కూడిన కరపత్రాన్ని వారికి అందించారు. సొసైటీ వద్ద చైర్మన్ పెనమారెడ్డి నాయుడు ఆధ్వర్యంలో తక్కువ ధరకు పాడి రైతులకు దాణా పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్, డీసీసీబీ మేనేజర్ శైలజ, ఎంపీడీవో ఎం.మల్లికార్జునరావు,ఇన్‌చార్జి ఏడీఏ సీహెచ్‌డీ విజయకుమార్, సొసైటీ చైర్మన్లు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, తోలేటి నారాయణమూర్తి, పెద్దిరాజు, వాంసంశెట్టి కుమార్, ఆదిమూలం సూరయ్యకాపు, శేరు శ్రీనుబాబు, పులపర్తి సుజాత, ముచ్చర్ల సాయి సత్యనారాయణ, ముచ్చర్ల సోమరాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

యానాం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంఘ ప్రతినిధులు తెలిపారు. పుదుచ్చేరి నుంచి రాష్ట్ర ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు యానాం వచ్చారు. తొలుత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రతినిధులు ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం యానాంలోని ప్రభుత్వ ఉద్యోగులతో స్థానిక సర్వశిక్ష అభియాన్ సమావేశపు హాలులో సమావేశం నిర్వహించారు. యానాంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంఘ ప్రతినిధులు తెలిపారు. యానాం ఉద్యోగుల సంఘం ప్రతినిధులు చెల్లి గోపీనాథ్, వెంటపల్లి వెంకట్రావు, శివ ప్రసాద్, పుట్టి ఏడుకొండలు, కృష్ణ, తిరుకోటి అర్జునరావు పాల్గొన్నారు.



మల్లాడిని సత్కరిస్తున్న ఉద్యోగుల సంఘ నాయకులు

సంస్కృతి ఉత్సవాలు ప్రారంభం

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అమలాపురం యర్రమిల్లివారి వీధిలో వేంచేసి ఉన్న సకల కార్యసిద్ధి హనుమాన్ ప్రాంగణంలో హనుమద్వ్రత పూజా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నుంచి సంస్కృతి ఉత్సవల్-2025 పోటీలు ప్రారంభమయ్యాయి. తొలుత సుందరకాండ పారాయణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంస్కృతి ఉత్సవ్‌లో భాగంగా రామాయణ జ్ఞానం, శాస్త్రీయ సంగీతం తదితర విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈపోటీలకు న్యాయ నిర్ణేతలుగా కూచి ప్రసాద్, పద్మినీ, ధన్వంతరి, బంగా ఆర్.కామేశ్వరరావు, ప్రభాకర్ మాస్టారు, దేవపూజ్యుల నాగమణి వ్యవహరించారు. శివపార్వతుల వేసధారణలతో పాటు రామాయణంలోని ప్రముఖుల పాత్రలను చిన్నారులు పోషించారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను చాణుక్య, లావణ్య, కౌటిల్య, తేజస్వి, యశస్వి, ప్రతీక్‌లు సమర్థవంతంగా నిర్వహించారు. డిసెంబరు2వరకు సంస్కృతి ఉత్సవ్-2025 పోటీలు జరుగుతాయని ముఖ్య నిర్వాహకుడు ఆకొండి పవన్ కుమార్ తెలిపారు.

గ్రామీణ ప్రాంత రహదారులకు అధిక ప్రాధాన్యం



మొసలపల్లిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

అంబాజీపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మొసలపల్లి అంబటివారిపేటలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మొసలపల్లి వంతెన వద్ద శ్మశాన వాటిక అభివృద్ధికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్, సొసైటీ చైర్మన్లు అరిగెల సూరిబాబు, సుంకర గణపతిరావు, కుడుపూడి రాంబాబు, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, పులపర్తి సుజాత, దంతులూరి శ్రీనురాజు, కొప్పిసీడి ఈశ్వరరావు, నూకపెయ్యి సూర్యచంద్రరావు, డొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

వైద్యాధికారులు, ఎంపీడీవోపై ఆగ్రహం

సదరమ్ స్లాట్ కోసం మంచానికే పరిమితమైన రోగులను ఇబ్బందులు పెట్టవద్దని చెప్పినప్పటికీ ఎందుకు బాధ్యత తీసుకోవడంలేదని ఎంపీడీవో బి.మమత,వైద్యాధికారులపై ఎమ్మెల్యే గిడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల ఇళ్లకు వైద్యాధికారులు, అధికారులు వెళ్లి వారికి సదరమ్ సర్టిఫికెట్లను అందించి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయాలని సూచించారు.

పరిశుభ్రత పాటించాలి

మామిడికుదురు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డీఎంవో ఎన్.వెంకటేశ్వరరావు సూచించారు. కరవాక గ్రామంలో జరిగిన డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పూలే ఆశయాలు కొనసాగిద్దాం



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

అమలాపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించి బహుజన రాజ్యం కోసం కృషిచేసిన మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమలాపురంలో పూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. దేశంలో 52శాతం జనాభా ఉన్న బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి కుసుమ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జిత్తుక సత్యనారాయణ, కార్యదర్శి కోనాల ప్రకాష్, నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, వాకపల్లి హరీష్‌కుమార్, జేడీఎస్ రాజు, గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు తాడి రాంబాబు, గెద్దాడ బుద్ధరాజు, మెండి డేవిడ్‌అంబేడ్కర్, బూసి రాంబాబు, కోడూరి సురేష్, కడలి వెంకటసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. నాయకులు కుడుపూడి త్రినాథ్, ముంగర ప్రసాద్, గుత్తుల సుబ్రహ్మణ్యం, మల్లుల పోలయ్య, పలివెల శ్రీను, పట్నాల వెంకటరమణపాల్గొన్నారు.

సినీ హాస్యనటుల సందడి



హాస్య నటులను సన్మానించిన అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు

అమలాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ చలనచిత్ర హాస్య నటులు అమలాపురంలోని అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు స్వగృహంలో శుక్రవారం సందడి చేశారు. విలక్షణ నటుడైన రాజీవ్ కనకాల, జబర్దస్త్ అశోక్‌లు మర్యాద పూర్వకంగా అల్లాడ స్వామినాయుడును కలిశారు. కోనసీమ ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు ఎప్పటికీ మరచిపోలేమంటూ వారు పేర్కొన్నారు. ఈసందర్భంగా స్వామినాయుడు రాజీవ్ కనకాల, అశోక్‌లను దుశ్శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకుడు నల్లా చిట్టిబాబు, టీడీపీ నాయకుడు దున్నాల దుర్గ, గోకరకొండ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్త ప్రోసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు

అమలాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘం డంపింగ్ యార్డు వద్ద చెత్తను ప్రోసెసింగ్ చేసేందుకుప్లాస్మాగ్రూప్ కాంట్రాక్టరు ముందుకు వచ్చారని కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం స్థానిక డంపింగ్ యార్డు వద్ద వేస్ట్ ప్రోసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. వేస్ట్ ప్రోసెసింగ్ యూనిట్ ద్వారా మున్సిపాలిటీలో చెత్తను నిర్మూలించడానికి మార్గం సుగమం అవుతుందన్నారు.డీఆర్వో మాధవి, అధికారులు పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలేకు ఘన నివాళి

యానాం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): యానాం సమాచార శాఖ, యానాం బీసీ సంఘం ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతి రావుపూలే వర్ధంతి నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ఎస్పీ వరదరాజన్, కళాశాల ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ సుధాకర్, ఎన్‌వైకే అధికారి గోపి, గుత్తుల రామారావు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అణగారిక వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని దారబోసిన మహనీయుడు పూలే అని మల్లాడి అన్నారు. నాయకులు మల్లాడి సత్తిబాబు, బీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీ స్కూళ్ల సందర్శన

అంతర్వేది, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం మోడల్ ప్రైమరీ స్కూలును పాఠశాల రీజనల్ డైరెక్టర్ జి.నాగమణి శుక్రవారం సందర్శించారు. 1నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులతో ముఖాముఖి జరిపి తరగతుల వారీగా ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. విద్యార్థులతో పద్యాలు పాడించారు. చిన్న పదాలు బోర్డుపై రాయించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు సూచనలు అందించారు. ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయుడు సోమశేఖర్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అయినవిల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండల పరిషత్ కార్యాలయంలో డీఆర్డీఏ వీవోఏలకు, గ్రామ సంఘాల సభ్యులకు శుక్రవారం పచ్చదనం-పరిశుభ్రతపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈశిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు అయినవిల్లి మండల అధ్యక్షురాలు ఎంఎన్ విజయలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పరిశుభ్రంగా ఉండాలి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో మహిళల పాత్ర చాలా కీలకమన్నారు. ఒకరోజు శిక్షణకు వచ్చిన అందరూ కూడా పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో జి.సరోవర్ సూచించారు. కార్యక్రమంలో మండలపరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్



ఐ.పోలవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ వేదికగా నిలుస్తుందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. శుక్రవారం మురమళ్ళ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజా సమస్యలు తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. బుచ్చిబాబు ప్రజల వినతులు స్వీకరించి, వారితో నేరుగా మాట్లాడారు. అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గ్రీవెన్స్‌సెల్‌తో సమస్యల పరిష్కారం

పి.గన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబునాయుడు రూపొందించారని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీరవెంకటసత్యనారాయణలు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించారు. వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన బాధితుడికి రూ.4వేలు అందించారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు, వివిధ శాఖల అధికారుల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నాటకరంగ అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లిబోయిన గంగాదేవి, గుమ్మడి వెంకటేశ్వరరావు, మద్దుల అనూరాజేశ్వరి, మద్దాల పెద్దకాపు, పులపర్తి సుజాత, పత్తిపాటి వెంకన్నబాబు, శేరు శ్రీనుబాబు, గుత్తుల రామకృష్ణ, నిమ్మకాయల శేషయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కాట్రేనికోన, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):కాట్రేనికోన రైతు సేవాకేంద్రం వద్ద శుక్రవారం టీడీపీరాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పెసింగి రంగారావువర్మ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు మోకా అప్పాజీ, చేకూరి వెంకటకృష్ణంరాజు, శీలం సూర్యనారాయణ, ఓలేటి భూషణం, యోగేశ్వరి, సానబోయిన వెంకటేశ్వర్లు, బండి శ్రీను, మధుర శ్రీను, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపుష్పయాగం

అమలాపురంరూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి):బండారులంకలోని త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో ఉన్న శివల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శ్రీమహాపుష్పయాగం నిర్వహించారు.

పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ



అమలాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని ఉండవల్లిలో గల ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో ఏపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి పాల్గొన్నారు. డిసెంబరు 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి సాధించుకోవాల్సిన ప్రాజెక్టులు, నిధుల విడుదల, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశాలు, వ్యూహాలపై చంద్రబాబు ఎంపీలకు పలు సూచనలు చేశారని ఎంపీ హరీష్ తెలిపారు.

కాట్రేనిపాడులంకలో ఎమ్మెల్యే దేవ పర్యటన

రాజోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాట్రేనిపాడులంకలో ఉన్న సమస్యలు, పరిష్కార మార్గాలపై కూటమి నాయకులు సంబంధిత అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ కాట్రేనిపాడులంకలోని ప్రతీ ప్రాంతాన్ని సందర్శించి అక్కడున్న సమస్యలను స్వయంగా ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. శ్మశానానికి త్వరలో రోడ్డు వేయిస్తానని, తాగునీటి ఇబ్బందులు లేకుండా తీరుస్తానని, లోఓల్టేజ్, షార్ట్ పోల్స్ వంటి సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. నిర్మాణ దశలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాలును పూర్తి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాజోలు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ అడబాల శ్రీనివాస్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలి

మామిడికుదురు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థితికి చేరాలని మండల విద్యాశాఖాధికారులు సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబు సూచించారు. శుక్రవారం మొగలికుదురు శ్రీచైతన్య విద్యార్థులకు నాసా సంస్థవారు నిర్వహించే ఎన్ఎస్ఎస్ స్పేస్ షటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో పాల్గొన్న శ్రీచైతన్య స్కూలు విద్యార్థులకు ఎంఈవోలు కిట్లు పంపిణీ చేశారు. స్కూలు ప్రిన్సిపాల్ బాలాజీ, అకడమిక్ డీన్ రమేష్, వెంకటేష్, శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

పొదలాడలో కేడర్ విత్ లీడర్..

రాజోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పొదలాడ జీఎస్ గార్డెన్స్‌లో రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య శుక్రవారం కేడర్ విత్‌లీడర్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. టీడీపీ రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబురాజు, గోదావరి డెల్టా ప్రాజెక్టు మాజీ చైర్మన్‌భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, పెద్దాపురం టీడీపీ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పొన్నమండ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.రాంబాబు తెలిపారు. రాజోలు మండలంలోని పొన్నమండ, చింతలపల్లి, కాట్రేనిపాడు, మెరకపాలెం, కూనవరం, ములికిపల్లి, మామిడికుదురు మండలంలోని మగటపల్లి, కొమరాడ, గోగన్నమఠం, ఆదుర్రు, లూటుకుర్రు, పాశర్లపూడిలంకలో శనివారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

లోకేశ్‌ను కలిసిన తెలుగు యువత అధ్యక్షుడు గోపి



రాజోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మంగళగిరి టీడీపీకార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను తెలుగుయువత మండలం అధ్యక్షుడు నాగిరెడ్డి గోపి మర్యాద పూర్వకంగా కలిశారు. టీడీపీని మరింత బలోపేతం చేయాలని లోకేశ్ సూచించారు. యువత సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని గోపీకి లోకేశ్ సూచించారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ముమ్మిడివరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో శుక్రవారం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లే విధానంపై దిశానిర్దేశం చేశారు. ప్రతీ ఇంటికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని చేరవేయడంలో పార్టీ కేడర్ పాత్ర కీలకమన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ సభ్యత్వాల పెంపు, పూర్తిస్థాయిలో బలప్రదర్శన, ప్రజలతో అనుసంధానాన్ని మరింత విస్తరించడం వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. ఎమ్మెల్యే సుబ్బరాజు సహకారంతో మురమళ్లలోని వారి కార్యాలయంలో తులసి కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1.75లక్షలు మంజూరు పత్రాన్ని అందించారు.

కొవ్వొత్తుల ర్యాలీ

ముమ్మిడివరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం పిలుపుతో వంద రోజులు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలు వద్దు.. చదువే ముద్దు నినాదంతో ర్యాలీలో పాల్గొన్నారు. పోలీసులు, అంగన్‌వాడీలు అలెర్ట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్ఐ జ్వాలాసాగర్‌తో పాటు అనేకమంది కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ సమాజాన్ని భావితరాలకు అందిద్దాం

మామిడికుదురు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్లీన్ అండ్ గ్రీన్‌తో కూడిన సమాజాన్ని భావి తరాలకు అందిద్దామని అసిస్టెంట్ లేబర్ అధికారి కె.శివనాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్‌పై అవగాహన కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, మహిళా సమాఖ్య సిబ్బందికి శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో జి.భవానీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అసిస్టెంట్ లేబర్ అధికారి మాట్లాడుతూ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇ-శ్రమ్ కార్డులను ప్రవేశ పెట్టిందని, ఈకార్డు ద్వారా రూ.2లక్షల ప్రమాద బీమాతో పాటు 60ఏళ్లు నిండిన వారికి నెలకు రూ.3వేలు పెన్షన్ లభిస్తుందని, దీనికి ఎటువంటి రుసుం చెల్లించకుండా ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు.

వృథాగా చేపలమార్కెట్ షెడ్డు



రైతుబజార్ వద్ద వృథాగా పడివున్న చేపల మార్కెట్‌షెడ్డు

• లక్షలు పోసి నిర్మించారు.. నిరుపయోగంగా వదిలేశారు..

మండపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతుబజారువద్ద గత వైసీపీ ప్రభుత్వంలో రూ.9లక్షలతో చేపలు విక్రయించేందుకు నిర్మించిన షెడ్డు ప్రారంభించినా నేటికీ వినియోగంలోకి రాక వృథాగా పడి ఉంది. రైతు బజారుకు వచ్చే వినియోగదారులకు అందుబాటులో ఉండేలా మత్స్యకారులు చేపల ఉత్పత్తులను ఇక్కడ నిర్మించిన షెడ్డులో విక్రయించుకునేలా దానిని నిర్మించారు. అయితే ప్రారంభించి చాలాకాలం కావస్తున్నా నేటికీ వినియోగంలోకి రాలేదు. ఇక్కడ చేపల విక్రయాలు జరగటం లేదు. దాంతో ఈషెడ్డు కాస్త చీకటి పడితే మందు బాబులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా లక్షలుపోసి నిర్మించి ఈచేపల విక్రయ షెడ్డు వినియోగంలోకి తేవాల్సిందిగా పట్టణ ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే బండారు



ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే సత్యానందరావు

ఆత్రేయపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ వేదికలో ప్రజల నుంచి వస్తున్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఈ వేదికద్వారా తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఇండ్లస్థలాలు, పింఛన్లు, గృహనిర్మాణాల కోసం వినతులు వెల్లువెత్తాయి. కొన్ని సమస్యలను అధికారుల ద్వారా ఎమ్మెల్యే సత్వరమే పరిష్కరించారు. మండలం నుంచి 311 వినతులు ఈ వేదికలో అందజేశారు. కార్యక్రమంలో ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, తోటకూర సుబ్బరాజు, ఎంపీడీవో వెంకటరామన్, తహశీల్దారు రాజేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

నూరుశాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలి

• అధికారుల సమీక్షలో మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు సమీక్ష



మండపేట మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ ఆర్డీ నాగ నరసింహారావు

మండపేట, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలో ఆస్తిపన్నుల వసూళ్లు నూరుశాతం సాధించాలని, శానిటేషన్ మెరుగుకోసం చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం మున్సిపల్ ఆర్డీ సీహెచ్ నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. మండపేట మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఆయన శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖలవారీగా చేపట్టిన పనుల పురోగతి గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు సమయ పాలన, తడి,పొడి చెత్త సేకరణ కంపోస్టు యార్డులో సేంద్రియ ఎరువు తయారీ గురించి ఆయన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. శానిటేషన్ విషయంలో రాజీపడకుండా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ఉద్యోగులను ఆదేశించారు. ఈసమావేశంలో కమిషనర్ టీ.వి.రంగారావు, ఆర్వో శాస్త్రీశ్రీనివాస్, మున్సిపల్ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించండి

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మహిళలకు ప్లాస్టిక్ వాడకం తగ్గించే విధంగా యానిమేటర్‌లు, గ్రామ సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ థీమ్ 5పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో గ్రామాల్లో మహిళలు తడి,పొడిచెత్త నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఇళ్లలో ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలు చెప్పి చైతన్యం పరచాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం పరిపాలన అధికారి సరేంద్రరెడ్డి, వెలుగు ఏపీ ఎం శ్యామ్, పలు గ్రామాల నుంచి వచ్చిన వెలుగు యానిమేటర్‌లు, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



అలమూరు మండలపరిషత్ కార్యాలయంవద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం, కె.గంగవరంలో డ్వాక్రా యానిమేటర్‌లతో ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్

శుభ్రత పరిశుభ్రతపై ప్రత్యేక శిక్షణ

ఆలమూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నిర్వహించే పారిశుధ్య కార్యక్రమాలపై డ్వాక్రా మహిళలకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. పంచాయతీరాజ్ రూరల్ డవలప్‌మెంట్ అవగాహన, శిక్షణలను శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎ.రాజు అధ్యక్షతన జరిగింది. గ్రామీణ ప్రాంతాలలో జరిగే పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ముందుగా పారిశుధ్య కార్మికులను ప్రతీఒక్కరూ గౌరవించాలని ఎంపీడీవో రాజు సూచించారు. పారిశుధ్య నిర్వహణలో డ్వాక్రా మహిళలు ఇంటింటికీ వెళ్లి మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈసందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవోఎం. మోహర్‌ప్రకాష్, ఏపీఎం సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహకం

• రైతన్న మీకోసంలో ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యదాయకమైన ప్రకృతి వ్యవసాయ సేద్యానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్రేయపురంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టి ప్రకృతి సేద్యాన్ని కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అన్నదాతలకు మరింత అండగా ఉండేందుకు రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. అనంతరం యూరియాను అందించారు. కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకట్రాజు, జక్కంపూడి బాలాజీ, జుజ్జవరపు హరిబాబు, ముదునూరి రామభద్రరాజు, వ్యవసాయశాఖ ఏడీఏ రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలను గుర్తించేందుకు గ్రామసభలు

కపిలేశ్వరపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో భూసమస్యలను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి. శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన గ్రామసభల షెడ్యూల్‌ను విలేఖర్లకు వివరించారు. ఈనెల 26 నుంచి 18 వరకు వడ్లమూరు, నిడసనమెట్ట, గ్రామసచివాలయాలవద్ద ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19 నుంచి 2026 జనవరి 9 వరకు నేలటూరు, వల్లూరు, జనవరి 12 నుంచి ఫిబ్రవరి 9 వరకు నల్లూరు, వెదురుమూడి, ఫిబ్రవరి 10 నుంచి మార్చి 6 వరకు అంగర, పడమరఖండ్రిక, మార్చి 7 నుంచి ఏప్రిల్ 2 వరకు కాలేరు, కోరుమిల్లి, ఏప్రిల్ 4 నుంచి 29 వరకు మాచర, వాకతిప్ప, ఏప్రిల్ 30 నుంచి మే 23 వరకు తాతపూడి, కపిలేశ్వరపురం, మే 25 నుంచి జూన్ 18 వరకు అద్దంకివారిలంక, కేదార్లంక, జూన్ 19 నుంచి జూలై 14 వరకు టేకి సచివాలయాలవద్ద గ్రామసభలు జరుగుతాయన్నారు.

మహాదేవస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం బిళ్ళకుర్రు గ్రామంలో అతి పురాతనమైన శ్రీ మహాదేవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు భూమి పూజచేశారు. దేవదాయశాఖ సీజేఎఫ్ నిధులు రూ.కోటి, అలాగే గ్రామానికి చెందిన నల్లం పల్లంరాజు-సుబ్బాయమ్మ దంపతుల కుమారులు వాడపల్లి వెంకన్న ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు కుటుంబ సభ్యులు అందించిన రూ.10లక్షల విరాళంతో ఈ ఆలయాన్ని పునర్నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆలయాల అభివృద్ధి పునర్నిర్మాణం సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకట్రాజు, ధరణాల రామకృష్ణ, నల్లం వెంకటరమణమూర్తి పాలూరి సత్యానందం, భాగవతుల వెంకటరమణమూర్తి, గనిశెట్టి వీరేష్, కముజు గంగాధర్, వీరబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

• ధాన్యం డబ్బుల జమతో రైతుల హర్షం

మండపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ధాన్యం రైతు సేవాకేంద్రాలద్వారా కొనుగోలు చేసిన కూటమి ప్రభుత్వం వెంటనే ధాన్యం నగదు రైతుఖాతాలో జమచేయటంపట్ల రైతులు కూటమి నాయకులు ప్రభుత్వానికి ధన్య వాదాలు తెలిపారు. మండపేట మండలం ఏడిదలో వున్న రైతు సేవాకేంద్రంవద్ద శుక్రవారం కూటమి నాయకులు రైతులతో కలిసి ధాన్యం విక్రయించిన నాలుగుగంటల వ్యవధిలో నగదు అందజేసి రైతులను ఆదుకున్న సీఎం నారా చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదేండ్ల మనోహర్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చంనాయుడు, ఎమ్మెల్యే వేగుళ్లకు రైతులు కూటమి నేతలు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో సాగునీటి సంఘ అధ్యక్షుడు కోలుపోటి బాబు, సహకారసంఘ అధ్యక్షుడు ఎర్రబ్బు, పి.వీర్రాజు, రైతులు కూటమి నేతలు పాల్గొన్నారు.



ఏడిదలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న రైతులు కూటమినాయకులు

ఆత్మకమిటీ ఛైర్మన్‌గా సీతారామకృష్ణబాలాజీ



ఆత్మకమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సీతారామకృష్ణబాలాజీ

కొత్తపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట వ్యవసాయ సబ్‌డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్‌గా రావులపాలానికి చెందిన జక్కంపూడి సీతారామకృష్ణబాలాజీ బాధ్యతలు స్వీకరించారు. 30 మంది ఆత్మా కమిటీ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. సభకు ముఖ్యఅతిథిగా ఏడీఏ ఎంవీ రామారావు పాల్గొని మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ, అనుబంధ రంగాలకు వారధిగా ఉండి నూతన సాంకేతికతను రైతులకు చేరవేస్తామన్నారు. ఛైర్మన్ సీతారామకృష్ణ బాలాజీ మాట్లాడుతూ ఆత్మకమిటీ ద్వారా మరింత మెరుగైన సేవలు రైతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి, సిద్ధిరెడ్డి శ్రీను, సాధనాల శ్రీను, కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్, పాలూరి సత్యానందం, బూసి భాస్కరరావు, నందం కాశి, అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కాంస్యపతకంతో లేఖా నిహారిక

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఈనెల 21 నుంచి 25వరకు అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో అండర్ 17లో రామచంద్రపురానికి చెందిన కారుమూరి లేఖా నిహారిక 66 కేజీల విభాగంలో ద్వితీయస్థానం సాధించి వెండిపతకం సాధించింది. బాలురు అండర్ 14 విభాగంలో జి.మనోహర్ 25 కేజీల విభాగంలో రజతపతకం సాధించాడు. పి.కిషోర్‌రాజు 50కేజీల విభాగంలో రజితపతకం సాధించాడు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి భువనేశ్వరి, సంయుక్త కార్యదర్శి ప్రసాద్, కోచ్ ఎస్.వెంకటేష్ అభినందించారు.

సీనియర్ అసిస్టెంట్‌గా ప్రసాద్‌కు పదోన్నతి



ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎంపీడీవో కీర్తి

రాయవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాయవరం మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ టి.వరప్రసాద్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించింది. శుక్రవారం ఆయన సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో కీర్తి స్పందతిన, సిబ్బంది ప్రసాద్‌ను అభినందించారు.

ఆదర్శ పొరుగు వారు-ఆదర్శ సమాజం బ్రోచర్ విడుదల

ఆత్రేయపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి బిలాల్ మసీదు ఆవరణలో శుక్రవారం జమాత్ ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆదర్శ పొరుగు వారు- ఆదర్శ సమాజం అనే ఉద్యమంలో భాగంగా బ్రోచర్‌ను హిమామ్ షేక్ వలీ ప్రారంభించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ఒడిశా భక్తుల పూజలు



వాడపల్లి వెంకన్న ఆలయంలో పూజలు చేస్తున్న ఒడిశా భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఒడిశా రాష్ట్రానికి చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి విశిష్టతను తెలుసుకుని దర్శించుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. అలాగే ఉభయతెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తిరువీధులలో ప్రదక్షిణలు నిర్వహించుకున్నారు. స్వామివారికి వివిధ ఆర్జిత సేవలు నిర్వహించారు. నిత్యాన్నదాన పథకానికి ఏలూరు జిల్లా కొండూరుకు చెందిన గోరిపతి నాగరాజు-వెంకటనర్సమ్మ దంపతులు రూ.50,011 విరాళం సమర్పించారు. ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు చేశారు.

మండపేట నియోజకవర్గం

రాజమహేంద్రవరంలో విలీనంపై సంబరాలు



ద్వారపూడిలో సంబరాలు జరుపుకుంటున్న కూటమి నేతలు

మండపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా నుంచి మండపేట నియోజకవర్గంను రాజమహేంద్రవరంలో కలుపుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయటంతో గ్రామాల్లో ప్రజలు కూటమి నేతలు సంబరాలు జరుపుకుంటున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కృషి ఫలితంగా విలీనం సాధ్యమైందని పలువురు పేర్కొంటున్నారు. పట్టువదలని భట్టీ విక్రమార్కుడిలా ప్రభుత్వంతో పోరాడి విలీనం సాధించిన ఎమ్మెల్యే వేగుళ్లకు స్థానిక నాయకులు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మండపేట మండలం ద్వారపూడి, కేశవరంలలో కూటమి నాయకులు కేక్ కట్‌చేసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్, ఐటీ మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బాణాసంచాను కాల్చి మిఠాయిలు పంచారు. ఈకార్యక్రమంలో మండపేట మండల టీడీపీ అధ్యక్షుడు కర్రి తాతారావు, ఎంపీపీ వాసు, కంటిపూడి శ్రీను, సహకార సంఘ అధ్యక్షుడు ఉండమట్ల శ్రీను, మాజీ టీడీపీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, గోణం పుల్లయ్య, పల్ల వీరబాబు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యాచరణ'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిశీలకులు అఖిలేష్ శుక్లా, పాలక్‌వర్మ

రావులపాలెం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అధిష్టానం కార్యాచరణ రూపొందించినట్లు ఏఐసీసీ కార్యదర్శి పాలక్‌వర్మ, జిల్లా పరిశీలకులు అఖిలేస్‌శుక్లా అన్నారు. రావులపాలెంలో శుక్రవారం కొత్తపేట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ రౌతు ఈశ్వరరావు (కాశి) ఆధ్వర్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న అఖిలేస్ శుక్లా, పాలక్‌వర్మ పలు అంశాలపై మాట్లాడారు. అలాగే పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున కార్గే, రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలోను జిల్లా అధ్యక్షులను నియమించేందుకు పరిశీలకులను నియమించారన్నారు. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అఖిలేష్‌శుక్లా, పాలక్‌వర్మలను నియమించారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు గిడుగు రుద్రరాజు, జంగా గౌతమ్, కామన ప్రభాకరరావు, నాయకులు ముళ్ళపూడి రాంబాబు, కొత్తూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలలో దంత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రావులపాలెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జడ్పీ బాలికల పాఠశాలలో విక్టరీ సంస్థల అధినేత గొలుగూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో దంత వైద్యశాలను ఏర్పాటు చేశారు. ఎపెక్స్ సూపర్‌స్పెషాలటీ దంత వైద్యులు పొలిశెట్టి రేవతిఅపర్ణ, విశ్వనాథ్ పాల్గొని సుమారు 500 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డి, సీఐ శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్నవాసంశెట్టి సత్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీనాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ నేత వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు. శుక్రవారం రామచంద్రపురం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ కార్యాకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు ఇప్పటి నుంచి సిద్ధం కావాలన్నారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రచారం చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిని కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు సమస్యలు ఉంటే ఆయా మండలాల అధ్యక్షులు పరిష్కారానికి కృషిచేయాలని పరిష్కారం కాని సమస్యలు మంత్రి సుభాష్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. టీడీపి సీనియర్ నాయకులు మాజీ ఎఎంసీ ఛైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, జెడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, రూరల్‌మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, నియోజవర్గంలో క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, డీసీ అధ్యక్షులు, గ్రామ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండపేట కౌన్సిల్ సమావేశం

మండపేట, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ టీ.వి.రంగారావు తెలిపారు. అనంతరం 11.30 గంటలకు అత్యవసర సమావేశం జరుగుతుందని ఆయన చెప్పారు. ఛైర్‌పర్సన్ పి.నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు సంతాపసభ

మండపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మరణించిన మండపేట మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ సంతాపసభను శనివారం మండపేటలో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని ఆలమూరు తాలుకా రైస్‌మిల్లర్సు భవనంలో శనివారం మధ్యాహ్నం మూడుగంటలకు జరిగే సంతాపసభకు కూటమి నాయకులు హాజరుకావాలని పట్టణ టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

అరసవల్లి సూర్యనారాయుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో వున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం శ్రీకాకుళం జిల్లాలో వున్న సుప్రసిద్ధ దేవాలయాలు, అరసవల్లి సూర్యనారాయణస్వామివారి ఆలయంతోపాటు శ్రీకూర్మం దేవాలయాలను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం వేగుళ్లకు స్వామివారి ప్రసాదాలు, అందజేసి వేదపండితుల ఆశీర్వచనం అందజేశారు.

కిసాన్‌మోర్చా కార్యదర్శి సతీష్‌రావుకు సత్కారం

ద్రాక్షారామ,నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాద సర్పంచ్, బీజేపీ కిసాన్‌మోర్చారాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్‌రావును శుక్రవారం పలువురు సత్కరించారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియామకం అయిన సందర్భంగా బీజేపీ నాయకులు, కాజులూరు పీఏసీ పీఎస్ త్రిసభ్యకమిటీ ఛైర్మన్ యాళ్ల సత్యనారాయణ, కాకినాడజిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి వేణుగోపాల్, చిక్కం విజయబాబు, రైతులు సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్రాక్షారామ, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ సబ్‌స్టేషన్‌లో నిర్వహణా పనులు నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. ద్రాక్షారామ, హసన్‌బాద, కందులపాలెం, ఉందూరు, భీమక్రోసుపాలెం, తాడిపల్లి, కాపవరం, వెల్లసావరం, వెల్ల, ఏరుపల్లి, తాళ్లపొలం, ఉట్రుమిల్లి, జేకె పాలెం, వెలంపాలెం, నెలపర్తిపాడు, వేగాయమ్మపేట, అన్నాయిపేట, తోటపేట, వెంకటాయపాలెం, వెల్ల గ్రామాలకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

జెడ్.మేడపాడు పంచాయతీ కార్యదర్శికి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి



అమర్‌నాథ్‌చౌదరి

మండపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెడ్.మేడ పాడు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వెంటూరి అమర్‌నాద్ చౌదరి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. ఆయన రావులపాలెం మండల డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఆయన తొలుత 1996లో పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు.సుదీర్ఘకాలం పాటు మండపేట మండలంలోనే పనిచేశారు. అమర్‌నాద్ పదోన్నతి పొందటం పట్ల స్థానిక మండపేట మండలం ఎంపీ డీవో సత్యన్నారాయణ మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనివాస్, ఏవో డి.వి.వి .రామకృష్ణ, ద్వారపూడి పంచాయతీ కార్య దర్శి ఆకుల రమణ అభినందించారు.

పూలే నేటి తరాలకు మార్గదర్శి : ఎమ్మెల్సీ తోట



మండపేటలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తోట, కొత్తపేటలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రాజు, ద్రాక్షారామలో నివాళులర్పిస్తున్న దృశ్యం

మండపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అణగారినవర్గాల ఆశాజ్యోతి మహాత్మాజ్యోతిరావు పూలే అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.రాణి అన్నారు. పట్టణంలో శుక్రవారం జ్యోతిరావు 135వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పెద్దకాల్వవద్ద వున్న పూలే విగ్రహానికి నేతలు పూలమాలలువేసి నివాళులర్పించారు. సమాజంలో అణగారిన వర్గాల కోసం పూలేచేసిన సేవలు మరువ లేనివని వారు అన్నారు. ఈకార్యక్రమంలో వైసీపీ నేతలు రెడ్డి రాధాకృష్ణ యాండ్ర బుజ్జి, బాపిరాజు, పిల్లి శ్రీను పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే చిరస్మరణీయుడు

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): కులవివక్షతకు వ్యతిరేకంగా పేద, బడుగు, బలహీన వర్గాల హక్కులకోసం పోరాడిన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావుపూలే చిరస్మరణీయుడని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రాజు పేర్కొన్నారు.శుక్రవారం పూలే వర్ధంతిని పురస్కరించుకుని పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు పూలే

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతీరావు పూలే అని ఎంటీసీ నాయకుడు యాట్ల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మహాత్మజ్యోతీరావు పూలే135వ వర్ధంతి పురస్కరించుకుని ద్రాక్షారామ మసీదు సెంటర్‌లో జ్యోతీరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కొండేపూడి నవీన్‌కుమార్, ఎండి అలీఖాన్, గారోజు సూరిబాబు, బిల్లకుర్తి స్వామి, మేడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ కార్యాలయంలో జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివార్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దంగేటి గౌరీశంకర్, కొసనా శ్రీనివాసరావు, కంచుమర్తిబాబూరావు, కొత్తపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో జ్యోతీరావు పూలే విగ్రహానికి పట్టణ వైసీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు పోతంశెట్టి గోపాలకృష్ణ, పెంటపాటి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ శాకా బాబి తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.